# HANNA KRUPA ®

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 11** **సంచిక : 5**


**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

## విషయసూచిక


| | | |
|---|---|---|
| జీవనమంతయు... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| విలియంకేరి... | ఆంద్రూస్ దావల, గుంటూరు | 4 |
| ప్రవక్త - యోవేలు | కొడవటికంటి | 6 |
| సువార్తికుడిగా జాన్‌డేవిడ్ | అరుణ్‌కుమార్ కె. మహంతి, సి.హెచ్.పేట | 8 |
| బీదలను కటాక్షించువాడు... | బి.ఇశ్రాయేలు, వారి సహచరులు | 10 |
| బైబిలు నందలి.... | ప్రసంగ సహకారి సౌజన్యంతో | 12 |
| నవంబర్ నెల ప్రశ్నలు | శ్రీ పంతగాని గ్రేషియస్ , ఏలూరు | 15 |
| విశ్వాసంలో ... | కొడవటికంటి | 16 |
| క్రీ॥శే॥వై.యస్.చిన్నకొండారెడ్డి | శ్రీ.వై.యస్.ప్రకాశ్ రెడ్డి , పులివెందుల | 20 |
| ప్రయాణంలో ఓ మజిలీ | శ్రీమతి ఉండవల్లి ఉమా లక్ష్మణరావు | 22 |
| చేజారిన అవకాశం | లియో టాల్‌స్టాయ్ | 24 |
| వాక్యంలోని వనితలు | శ్రీమతి దానం మెర్సీ ఇశ్రాయేలు, నెల్లూరు | 27 |
| యేసుకథ | కొడవటికంటి | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |



**కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

చీఫ్ ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ - 51, డోర్ నెం.54-1-23(ఎ)

కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు-523 001

9866716506


**సంవత్సర కానుక : రూ. 200/**

| | |
|---|---|
| ఆన్‌లైన్ అకౌంట్ నెం. : | **10957294362** |
| బ్రాంచి నెం. | : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా |
| అకౌంట్ హోల్డర్ | : కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు |
| సెల్ | : 9866 716 506 |


Editor :

**Rev. Nathaniel R.Kodavatikanti** B.Th., M.A., M.Phil

Gen Secretary,UCLI.Ongole

Hon. Editor :

**Rev. K. Vijaya Chandra**

Hannahkrupa Memorial Church, Bangalore

Hon. Advisor :

**Sri. Yadavalli Prasada Rao**

Pay & Accounts Officer, Hyderabad

Patrons :

**Dr. Y.S. Purushotham Reddy**

Spdt, Sri Rajareddy Hospital

Pulivendula

**Sri. M.Shalem Vikranth Vardhan**

Director, Good News Messengers, Guntur

**Dr. Pikkili Hussenaiah**

Sri Parvathi Nursing Home, Besthavaripeta

**Smt. Mahasamudram (Katta) Nageswari Bhaskar, M.Sc., H.Sc.,Hyd.**

**Smt. K. Victoria Rukmini, B.A.,B.Sc.,B.Ed.**

Rtd. H.M., Markapuram

**Dr. Z.C. Devadanam,** Former Treasurer

National Council of Churches in India,

Nagpur, Resident at Karnool

# జీవనమంతయు...



ఓరోజున ఓ గొప్ప సువార్తికుడు నా ఆఫీసుకు వచ్చాడు. వచ్చినప్పుడు చాలా సంతోషంగా వచ్చాడు కానీ కొద్దిసేపటికే విచారంగా మారిపోయాడు. ఎందుకంటే నా సేవలో విదేశీయుల సహవాసం ఏమీలేదని తెలుసుకున్నాడు. ఆయన నన్ను చాలా ప్రేమిస్తాడు అని నాకు తెలుసు. ఆయన వెళ్ళిపోతు 'నేను నీకు ఓ అమెరికా అడ్రసు ఇస్తాను, ఉత్తరం వ్రాస్తావా?' అన్నాడు. 'ఎందుకు?' అన్నాను. 'ఏదైనా సహాయం పొందవచ్చును' అన్నాడు.

1972లో నేను అమెరికా వెళ్ళివచ్చానని ఆయనకు తెలుసు. కాని నేను చేతకానివాడినని, నాకు సహాయం చెయ్యాలని హృదయపూర్వకముగా ఆశించాడు. 'ఇప్పుడు నేనున్న స్థితిలో మరెవ్వరు లేరని నేను భావిస్తున్నానండి. ఎందుకంటే నేను సమృద్ధిలో ఉన్నాను' అన్నాను. 'సమృద్ధి అంటే ఇదేనా?' అన్నాడు. 'సమృద్ధి హృదయంలో ఉంటుంది. సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభ సాధనము కదా!' అన్నాను. ఆయన వెళ్ళిపోయాడు.

మనము మన అవసరాల కోసం ఎవరినైనా ఏమైనా సహాయం అడిగితే, లేక ఇన్ డైరెక్టుగా ప్రార్థించమని అడిగితే వారు కొంత సహాయం చెయ్యవచ్చును. కాని మనము అడుక్కొనిన డబ్బు ఆశీర్వాదము కాదు.

నాకు చాలా కాలంగా తెలిసిన వ్యక్తి ఒకరున్నారు. ఆయన ఎప్పుడు ఎక్కడ కనబడినా తన ఇంటికి ఆహ్వానిస్తు ఉంటాడు. చివరికి ఓ రోజున వారి ఆహ్వానం మేరకు వారింటికి వెళ్ళాను. ఆయన చాలా గొప్ప సంస్థకు అధినేత అని అప్పుడే నేను తెలుసుకున్నాను. ఆయన ఆఫీసులో కూర్చుని, నేను కూర్చున్న తర్వాత 'మీ అవసరాలు చెప్పండి' అన్నారు తీరికగా.

'అయ్యా! నాకు అవసరాలు ఏమీ లేవండి!' అన్నాను. ఆయన ఊహించని జవాబు అది. ఆయన కొంచెం ఆగి 'మీ ప్రార్థనా అవసరాలు చెప్పండి' అన్నారు. ఈసారి నేను ఇరుకులో పడ్డాను. ఎలా జవాబివ్వాలో నాకు తెలియలేదు. కాని 'అయ్యా నేను యదార్థము చెబుతున్నాను. ప్రభువు సేవలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు ఎవరినైనా నాకొరకు ప్రార్థించండి అని కాని నా ఈ అవసరాల కొరకు ప్రార్థించమని కాని నేను అడుగలేదు. 2000 సంవత్సరం మే నెలలో ఆరు నెలలు అస్వస్థతతో ఉండి మరణశయ్య మీద ఉండి కూడా నా కొరకు ప్రార్థించమని అడుగలేదు. నాకొరకు తనంత తానుగా స్వస్థతా వరము కలిగిన ఓ సహోదరి ప్రార్థించడానికి నావద్దకు బయలుదేరి వస్తున్నానని కబురు చేసింది. ఆమె నా దగ్గరికొచ్చే లోపలే ప్రభువు స్వయముగా నన్ను దర్శించి ఆయన దర్శనము ఇచ్చాడు. ఆ సహోదరి నావద్దకు వచ్చి – నేను ఆమెతో ఏమీ చెప్పక ముందే ప్రభువు నీకు దర్శనము ఇచ్చాడు కదా! ఇక నా ప్రార్థనతో అవసరము లేదు అని వెళ్ళిపోయింది. నేను ఇతరుల కొరకు ప్రార్థిస్తున్న రీతినే నాకొరకు అనేకులు ప్రార్థిస్తున్నారని నాకు తెలుసు' అన్నాను.

ఆయన నా రచనలు చూస్తూ 'ఈ పుస్తకం ప్రింటింగ్‌కి ఎంత అవుతుంది?' అని ఒక్కో పుస్తకం గురించి అడిగారు. 'సార్! ఏ పుస్తకమైనా మినిమమ్ పాతిక వేలు' అన్నాను. ఆయన పాతికవేలు ఇచ్చి 'ఓ పుస్తకం ప్రింటు చేయించండి' అన్నాడు. ఆవిధంగా ప్రేరేపింపబడిన ప్రభువు బిడ్డల దాతృత్వముతోనే ఇప్పటికి దాదాపు ఇరవై పుస్తకాలు మార్కెట్‌లోకి వచ్చాయి.

నేను ఓ ఊరు వెళ్ళాను. అక్కడ నా బంధువులు రెండు కుటుంబాల వారు నాతో చాలాసేపు మాట్లాడారు. ఒక్కరిద్దరు వారి ప్రార్థన అవసరాలు రెండు మూడు విషయాలు చెప్పి గట్టిగా ప్రార్థించమని అడిగారు. 'నేను ఉదయం సాయంకాలం ప్రార్థించవలసిన లిస్టు చాలా పెద్దది ఉన్నది. కనుక మీరు నాకు ఒక్కసారి ఫోను చేస్తే రెండవ రోజు మీకొరకు ప్రార్థిస్తాను' అని చెప్పాను. ఇంటికి వచ్చి వారికి ఫోను చేశాను. 'మీరు ప్రార్థనా అవసరాలు నాకు చెప్పారు. మరి సువార్తికునిగా నాకు చందా ఇవ్వలేదు

**తరువాయి భాగం 14వ పేజీలో**

# విలియం కేరీ - మహనీయ జీవితం 

రచన - ఆంద్రూస్

దేవునిసేవలో పేదరికం కూడా ఒక భాగమేనని సరిపెట్టుకున్నాడు కేరి. సాధారణంగా దేవుని సేవకు సమర్పించుకున్న వారికున్నంత అంకితభావం కుటుంబ సభ్యులకుండడమూ వారూ వారి సేవలో సహకరించడం అరుదైన విషయం. విలియం కేరికి కుటుంబ సహకార యోగంలేదు. అనునిత్యం సణుగుడు, గొణుగుడూ, నిష్ఠూరాలు, మూతి విరుపులతో భార్య డోరతి కేరిని కుళ్ళబొడుస్తూ ఉండేది. కుటుంబ పోషణ విషయంలో తన అసమర్ధతే దీనంతటికి హేతువుగా భావించి, ఆమె ప్రవర్తన కూడా సమంజసమైనదే అనుకునేవాడు కేరి. దినంలో ఏదో కొంత సమయం కేటాయించుకుని, చెప్పులు కుడుతూ అదనంగా నాలుగురాళ్ళు సంపాదించేవాడు. మనిషి, మహనీయుడవ డానికి పేదరికం ఒక సోపానమేమో తెలియదు గాని తన దుర్భర జీవితం కేరి ఆధ్యాత్మిక ప్రగతి బాటకు ఏమాత్రం అడ్డుగోడ కాలేదు.

మోల్టన్ పట్టణంలో ఆనాడు కేరి నివసించిన ఇల్లు, వ్రాసుకోవడానికి ఉపకరించిన బల్ల, తోళ్ళునానుకోవడానికి వాడుకున్న తొట్టి ఈనాటికి ఒక మ్యూజియం జ్ఞాపికలుగా యాత్రికులనాకర్షిస్తూనే ఉన్నాయి. దుర్భరమైన దారిద్ర్యపు కోరల్లో బందీగా నికృష్టజీవితం గడుపుతూ, గయ్యాలి భార్యను అనునయించుకుంటూ 'మీరు సర్వలోకమునకు వెళ్ళి, సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి" అను క్రీస్తు చివరి ఆజ్ఞను పాటించేవరకు కంకణం కట్టుకున్న కార్యసాధకుడు కేరి. బహుశా తననే ఉద్దేశించి క్రీస్తు అలా ఆజ్ఞాపించాడేమో! "సర్వలోకానికి సర్వసృష్టికి" అనే పదాలు విశ్వాన్ని ప్రేమించే వారికే అర్ధమవుతాయి. విశ్వ మానవులకు మాత్రమే అది సాధ్యపడే విషయం. ఆ ఆజ్ఞ ఒక శాసనమై తన గుండెలో నిర్దిష్టరూపం సంతరించుకున్నట్టు భావించుకునేవాడు. మెలుకువగా ఉన్నంతకాలము అవే ఆలోచనలు, నిద్రించే టప్పుడు అవే కలలు. ఆ కలలు వాస్తవ రూపం దాల్చకుంటే తనకు శ్రమ అంటూ వాపోయేవాడు.

సర్వలోకపు పరిధి ఎంత? సర్వసృష్టిని చేరుకునే మార్గాలేమిటి? ఆ మార్గంలో నిలబడేంతవరకు చేయవలసిన ప్రయత్నాలేమిటి? తన స్వీయ ప్రయత్నాలను తన గమ్యం అనుసంధానం చేయగల శక్తులేమిటి? సర్వలోకము ఎక్క డుంది? దాని స్వరూప, స్వభావాలేమిటి? ప్రపంచ పటం ముందు పెట్టుకుని గంటల తరబడి దానివైపే చూస్తూ, ఆయా దేశాలలో తన గమ్యాలను గుర్తుంచుకునేవాడు. ఆ దేశాల భాషలు, నాగరికత, సంస్కృతి, ఇప్పటివరకూ సువార్త ప్రకటనపరంగా జరిగిన ఉద్యమాలు తెలుసుకోవాలనే తపన. ఆగంతకు లెవరెదురైనా, విదేశీయులను కలుసుకున్నా, వారిని ప్రశ్నించి, విసిగించి, విషయసేకరణ గావించి భద్రంగా నోట్సు వ్రాసుకునేవాడు. ఆయా దేశాల భౌగోళిక స్వరూపం, చరిత్ర, నడుస్తున్న రాజకీయలు, ఆ వ్రాతలకు మేత.

ప్రపంచదేశాల నావిధంగా ఆకళింపు చేసుకుని "ఎంక్వయిరి" అనే పేరుతో ఒక విశిష్ట గ్రంథాన్ని సంకలనం చేశాడు. ఒక బాప్టిస్ట్ సంఘం వారిచ్చిన పది పౌండ్ల విరాళం తో ఆ పుస్తకం ముద్రణకు నోచుకుంది. 1792లో వెలుగు చూసిన ఆ చిన్న పుస్తకం మరోనాటికి "ఆల్ చర్చ్ మిషనెరి మూవ్‌మెంట్' సంభవానికి ప్రేరణ, మహావృక్షంగా ఎదిగిన ఒక మహత్తర ఉద్యమానికి ఆ పుస్తకమే బీజం. సత్యవాక్య పరంగా జాగృతమైన నాగరిక దేశాల భక్తులకు సర్వలోకానికి సువార్త ప్రకటించాలనే బాధ్యత తెలియజేస్తూ అందుకు అవసరమైన విషయ పరిజ్ఞానాన్ని అందించే అపురూప బాంఢాగారం ఆ పుస్తకం.

ప్రభువైన క్రీస్తు ప్రకటించిన అంతిమాజ్ఞ శిరసావ హించాల్సిన బాధ్యత ఆనాటి శిష్యులకే గాదు, ఈనాటి క్రైస్తవులందరిదీ అని జ్ఞానోదయం కలిగించే నిబంధనలు ఆ పుస్తకంలో నిక్షిప్తమయ్యాయి. ఆయా దేశాలలో ప్రాధమికంగా సువార్త సేవ నడ్డగిస్తున్న గోడలు, వాటి నధిగమించి సువార్త ధ్వజాలను ప్రతిష్ఠించే మెళకువలు ఆ పుస్తకంలో సూచించ బడ్డాయి. ఈనాటికీ "ఎంక్వయిరి" అనే ఆ లఘుగ్రంథం మిషనెరి వ్యవస్థకు దిక్సూచి. ఆ దినాల్లో ప్రపంచాన్ని చుట్టి

రావాలంటే సముద్ర ప్రయాణమే మార్గం. ఆ ప్రయాణాలు తుఫాను తాకిడీలతో, బందిపోటుల దోపిడీలతో అపాయ కరంగా ఉండేవి. సముద్ర ప్రయాణమంటే వ్యయ ప్రయాస లతో కూడిన సాహసం. అందుకెంతో తెగింపు కావాలి. తెగించే వారికి త్యాగధనం పుష్కలంగా ఉండాలి. అదే కేరి అంత రంగంలో మదనమవుతున్న నిరంతర సంఘర్షణ. సముద్ర యానాలు అపాయకరమనీ విదేశాలలో మిషనెరీ ఉద్యమాలు ప్రమాదభరితమని భీతితో సాహసించడానికి తాను వెనుకాడు తున్నాడా? లేకుంటే ఆ దిశగా తానెందుకు తీవ్రంగా ప్రయత్నించడం లేదు? తుచ్ఛమైన ధనార్జనకే మానవుడు సముద్ర ప్రయాణాలలోని ప్రమాదాల్ని ఖాతరు చేయడం లేదు. మరిక ఆత్మల సముపార్జననే పవిత్రోద్యమాన్ని తలపెట్టిన వారెందుకు వెనుకాడాలి?

ఆనాటి అపోస్తలులు క్రీస్తు ప్రేమే ప్రేరణగా, అంకితభావమే ఇంధనముగా, సాహసమే ఊపిరిగా కఠిన హృదయాల్ని కరిగించారు. మూర్ఖమానవుల్ని ముట్టడించారు. అభియోగాల్ని తట్టు కుంటూ ఆత్మల్ని సంపాదించారు. అప్పటికీ, ఇప్పటికీ అన్ని రంగాల్లో ఆధునికత అలుము కుంటూ ఉంది. ప్రయాణ సౌకర్యాలు మెరుగయ్యాయి. వసతులు పెరిగాయి.

ఒకవేళ పరమత సహనంలేని విదేశాల్లో ప్రజలు ఈ నూతన సువార్త కార్యక్రమాల్ని అటకాయించి, మిషనెరీలపై దాడులు జరిపి హింసిస్తారని భయమా? అలాగైతే సిద్ధాంతపరంగా అంకితమంటూలేని రాజకీయ వేత్తలు, తమ అర్థరహిత ఉపన్యాసాలతో ప్రజల ముందుకు రావడం లేదా? ఒక దేశంవారు మరొక దేశంలోకి ఏదో మిషతో జొరపడి, స్థిరపడి, రాజ్య విస్తరణ కాంక్షతో పరాయి భూముల్ని భుక్తం చేసుకుని పరిపాలించడం లేదా అశాశ్వత ఆస్తులు ఆర్జించాలని తాపత్రయపడే నిమిత్తమాత్రులకు లేని భయాందోళనలు, శాశ్వత ముక్తికి బాసటైన సజీవ సువార్తను ప్రకటించడానికి దైవ ప్రతినిధుల కెందుకుండాలి?

వాస్తవాల్ని ప్రకటించడం దోషమెందు కవుతుంది? దైవాన్ని ఎరుగని సాటి మానవులకు వాక్యంతో జ్ఞానోదయం కలిగించడమే పరమావధిగా, ధ్యేయంగా బాధ్యతగా సాహసించే సంస్కరణాభిలాషులు దోషులెలాగవుతారు? అలా సాహసించని వారే దోషులవుతారు... ఇవే విలియం కేరి అంతరంగంలోని సంఘర్షణాంశాల పరిష్కారాలు. మొరోనీయులు, యూరో పియన్‌వారు, విలియట్, బ్రైనార్డ్ వంటి ప్రచారవీరులు, విదేశాల్లో నిర్భయంగా క్రీస్తును ప్రకటించారు. సత్ఫలితాలు సాధించడానికి వారేమాత్రం వెనుకాడలేదు. నాకెందుకవి సాధ్యంకావు? సాధ్యంకావనే సంశయం నాకెందుకు రావాలి? ఆత్మబలం, ఆత్మ ప్రేరేపణ ఆలంబనగా సర్వసృష్టిని క్రీస్తు వైపుకు ఆకర్షితుల్ని చేయాలనే సంకల్పదీక్ష ఉన్నవారు, అంతరిక్షానికి ఎత్తబడి, సామూహిక దీపాల్లా ప్రతిష్టించబడి, విశ్వరూపమంతటికీ వెలుగులు జిమ్మే మహర్షులవుతారు. విశ్వదీక్షణకనుగుణంగా సిలువ ధ్వజాన్నెత్తుకుని నిలబడ తారు. అర్థ దారిద్రమే గాని, భావ దారిద్ర్యమెరుగని కేరి, కొన్నాళ్ళపాటు తన అంతరంగంలో సంఘర్షణకు తావిచ్చినా, విముక్తుడై విజయకేతనం ఎగురవేశాడు. ఒకనాటికి ఆధునిక మిషనెరీ వ్యవస్థకే ఆద్యుడయ్యాడు. వ్యక్తిగా సువార్త రంగంలో కాలుమోపి, వ్యవస్థగా పరిణమించాడు. భారతీయ క్రైస్తవ చరిత్రలోనే మహనీయ మహర్షిగా మిగిలాడు.

కొన్ని చేతన, అచేతన కర్తలసంధానికి భవభందాలే కారకులవుతాయేమో! మిషనెరీ ఉద్యమానికి ఉవ్విళ్ళూరు తున్న విలియంకేరికి ఆదరవు, అండ ఏ దిక్కునుండి వస్తుందో నని ఆగమ్యగోచరంగా ఉన్న కాలంలో “ఎంక్వయిరీ” అనే చిరుగ్రంథం వ్రాశాడు. అది బహుళ ప్రచారం పొంది పాఠకుల గుండెల్ని కదిలించి కర్తవ్యం బోధించింది. ఎవరికి వారు తమ వరకు క్రీస్తును తమ వ్యక్తిగత రక్షకునిగా అంగీకరించడమే గాదు, ఆ వాక్యంతో పరిచయంలేని వారికి, ఆ సువార్తను వినసోచుకోని వారికిగూడా వినే సదుపాయాలు ఏర్పాటు చేయగల మిషెనరి ఉద్యమం గురించి ఆ గ్రంథం విపులీకరించింది. ఐరోపు క్రైస్తవులను ఆలోచింపజేసింది. ఆ గ్రంథం పుట్టించిన వేడి, ఆరని అగ్నిగా మారి ఇంగ్లాండు దేశమంతటా దావానలమయింది. విదేశీయులకు సువార్త ప్రకటింపబడాలి అనే అంశం పైన ఆసక్తి రేకెత్తించింది. చివరకు తను వ్రాసుకున్న పుస్తకమే విలియంకేరిని మిషనెరిగా భారతదేశానికి పంపించింది.

# ప్రవక్త - యోవేలు

యోవేలు అంటే యెహోవా దేవుడు అని అర్ధము. చిన్న ప్రవక్తలలో రెండవవాడు. అతని తండ్రి పేరు పెతూయేలు. అతను యెరూషలేములోను యూదయలోను ప్రవచించు చుండెను.

ఆయన ప్రవచించిన కాలము కూడా సరిగా తెలియదు. క్రీస్తు పూర్వం 500 నుండి 800లోపు సంవత్సరాలలో ప్రవచించెను. అతను యూదయమీదకు దండెత్తి వచ్చే మిడుతల దండు గూర్చి ప్రవచించెను. కొంతమంది పరిశోధకులు ఈ మిడుతల దండు అష్షూరు సైన్యమును గూర్చినదని చెబుతారు. అయితే రాజరికమును గూర్చిగాని రాజ్యాలను గూర్చి గాని ఇతడు ప్రవచింపలేదు.

పాతనిబంధనలోని ఇరవైవ గ్రంథము 'యోవేలు' ఇతని గ్రంథమును రెండు భాగాలుగా చెప్పవచ్చును. మొదటిది 1:1,2-17; 2:18; రెండవది 3:21.

మొదటిభాగమును దక్షిణ దేశము అంటే యూదా రాజ్యములోని పెద్దలకు రాబోయే మిడుతల దండును గూర్చి చెప్పడం తరువాత వెంటనే రాబోయే కర్తవలనైన చింతలు, బాధలు, ప్రజలు కాని యదార్ధముగా మారుమనస్సు పొందక పోతే రాబోయే ప్రభువు దినమును భరించుటకు ఏడ్పుతోను, అంగలార్పుతోను మారుమనస్సు పొందండి. మీ వస్త్రములను కాక మీ హృదయములను చించుకొనండి అని చెప్పాడు.

రెండవ భాగములో దేవుడు మన ప్రార్ధనలు వింటాడు గనుక దేవుని ప్రవక్తలకు లోబడి దేవుని కొరకు ఎదురు చూడమని చెప్పాడు. అప్పుడు దేవుడు విస్తారమైన వరములను కురిపించుతాడు. సర్వ శరీరులమీద నా ఆత్మను క్రుమ్మరించెదను అని ప్రభువు సెలవిచ్చాడు.

ఆ దినములలో నేను సర్వజనులమీద నా ఆత్మను కుమ్మరింతును. మీ కుమారులును మీ కుమార్తెలును ప్రవచనములు చెప్పెదరు. మీ ముసలివారు కలలు కందురు. మీ యవ్వనస్తులు దర్శనములు చూచెదరు. ఆ దినములలో నేను పనివారిమీదను, పనికత్తెలమీదను ఆత్మను క్రుమ్మ రింతును. ఇప్పుడైనను మీరు ఉపవాసముండి కన్నీరు విడుచుచు, దుఃఖించుచు, మనఃపూర్వకముగా తిరిగి నా యొద్దకు రండి అని ప్రభువు పిలుస్తున్నాడు అని చెప్పాడు.

దేశం మరల క్రొత్తదిగా చేయబడుతుంది. నేనే యెహోవాను నా సైన్యాన్ని మీకు ఏదో విధంగా పంపించాను. ఆ దండు మిడుతలు ఆ దూకుడు మిడుతలు ఆ వినాశన మిడుతలు మరియు ఆ కొత్త మిడుతలు మీ పంటను తినివేశాయి. కాని నేనే యెహోవాను! ఆ కష్టకాల సంవత్స రాలన్నిటికి తిరిగి మీకు నేను చెల్లిస్తాను.

అయితే ప్రస్తుత యుగ వ్యాఖ్యాతలు యోవేలు 444 క్రీస్తు పూర్వం భాగము అంటే ఎజ్రాగారికి సమకాలీనుడని చెబుతారు. ఎందుకంటే 721 అష్షూరు రాజు ఉత్తర రాజ్యాన్ని జయించి అక్కడి వారినందరిని తీసుకెళ్ళిన సంగతి ప్రస్తావించలేదు.

వాఙ్మయములలో ఈ గ్రంథము బహు మృదువైనది. ఆత్మను క్రుమ్మరించుటను గూర్చిన ప్రవచనమును పరిశుద్ధుని రాకడను గూర్చిన ప్రవచనము నెరవేరెనని పేతురు యెరూషలేములో చెప్పెను. ఆ వాక్యములో నుండియే పౌలుగారు ఒక భాగమునెత్తి అన్యులుకూడా దేవుని రాజ్యములో చేరెదరని బోధించాడు.

---

**23వ పేజి తరువాయి భాగం**

మాసాబ్ ట్యాంకు వద్దగల శ్రీ యడవల్లి ప్రసాదరావుగారి ఇంటివద్ద వదిలారు. ప్రసాదరావుగారితో కలిసి వారి కారులో మధ్యాహ్నం పదకొండు గంటలకు ఆకాశవాణి స్టూడియోలోని డా॥ ఝాన్సీ కె.వి.కుమారి గారి ఆఫీసు చేరాము. పదకొండున్నరకు డా॥ కె.వి.కుమారిగారు కొడవటికంటిని రచయితగా వారి పరిచయాలు, జ్ఞాపకాలు, అనుభవాలను ప్రశ్నాపూర్వక సంభాషణతో రికార్డు చేశారు. తర్వాత ఝాన్సీ గారి ఆతిధ్యములో భోజనము చేసి ఆబిడ్స్‌లోని సి.యల్.యస్. బుక్‌షాపు సికింద్రాబాద్‌లోని గుడ్‌న్యూస్ - బెత్లేహేము బుక్‌షాపులను కలుసుకొని నిమ్మగడ్డ సుధీర్‌గారి సహకారముతో జనరల్ బోగీలో, సీటులో కూర్చుని ప్రయాణం చేసి, తెల్లవారు మూడు గంటలకు ఒంగోలు చేరాను.

**26 వ పేజి తరువాయి భాగం**

ఆర్పివేయాలని, లేకుంటే ఇల్లు తగలబడుతుందని అనుకొని నప్పటికి గోర్గే వెంటపట్టాడు. గోర్గే తన ఇంటివెనుక తలుపు దగ్గరకి వచ్చాడు. ఇవాన్ వేగంగా వచ్చాడు. అతని తలమీద ఏదో బలమైనది పడ్డది. కండ్లు బైర్లు కమ్మాయి. కొంచెం ఊగి క్రిందపడిపోయాడు. మరలా తలమీద ఏదో పడ్డది. చాలా నొప్పి. కానీ అరవలేక పోయాడు. తల త్రిప్పి చూసాడు. తన పశువుల కొష్టాం పూర్తిగా కాలిపోయింది. ముందు ఇల్లు కాలడం ప్రారంభమైంది. జనం మూగారు. అరుస్తున్నారు. తన పెద్ద కుమారుడు తన తండ్రిని ఎత్తుకొని వెళ్తున్నాడు. ఇవాన్ చిన్నగా నడుస్తూ కాలుతున్న ఇంటిలోకి వెళ్ళాడు. అందరు అరుస్తున్నారు. తనమీద ఏదో మండుతూ పడింది. తను పడిపోగా ఎవరో వచ్చి ఎత్తుకున్నారు. ఇవాన్ గడ్డం, తల వెంట్రుకలు కాలిపోయాయి. గోర్గే ఇల్లు కూడా మంటల్లో ఉంది. ఇంట్లో నుండి మనుష్యులు బయటికి వచ్చారు. పశువులను తప్పించారు. కోళ్ళు కాలిపోయాయి. గోర్గే ఇల్లు కూడా పూర్తిగా కాలిపోయింది. ఇంకా కొందరి ఇండ్లు కాలి పోయాయి.

ఎవరో వచ్చారు. 'ఇవాన్! నీ తండ్రి చనిపోతు న్నాడు. ఊరి పెద్ద ఇంట్లో పండుకొని ఉన్నాడు. నిన్ను రమ్మన్నాడు' అని చెప్పారు. 'నా తండ్రి ఎవరు? వీరంతా ఎవరు?' అన్నాడు.

ఈ అపాయములో అతనికి మతి చెదిరింది అనుకొన్నారు. కొంచెంసేపటికి చిన్నగా లేచి గ్రామపెద్ద ఇంటికి వచ్చాడు. తండ్రి చేతిలో కొవ్వొత్తి ఉన్నది. చనిపోయే వాళ్ళ చేతిలో కొవ్వొత్తి పెడతారు. తండ్రి ఇవాన్‌ని దగ్గరగా రమ్మని సైగచేశాడు. 'నాయనా! ఈవిధంగా జరుగకముందే దీనిని తప్పించమని చెప్పాను. ఇంతకి నిప్పు ఎవరు పెట్టారు?' అన్నాడు.

'వాడే – వాడే – వాడు నిప్పుపెడుతుంటే నేను పట్టుకున్నాను. వాడు గడ్డికి నిప్పుపెట్టాడు. ఆ నిప్పును ఆర్పివేయకుండా నేను వాడి వెంట పరుగెత్తాను. అది నేను ఆర్పివేసుంటే ఇలా జరిగేది కాదు' అన్నాడు.

'ఇవాన్! మరణం నా వద్దకు చాలావేగంగా వస్తోంది. నేను చనిపోతాను. నువ్వు కూడా కొంతకాలానికి చనిపోతావు. ఇంతకి 'పాపి' ఎవరు?' అన్నాడు.

ఇప్పుడు ఇవాన్‌కి పూర్తిగా అర్థం అవుతుంది. తనెంత బుద్ధిలేనివాడో తెలుసుకున్నాడు. మోకాళ్ళ మీద కృంగి తండ్రి పాదాలమీద పడ్డాడు. 'నాయనా! నన్ను క్షమించు! యేసుప్రభువు పేర నన్ను క్షమించు! నేను దేవుని యెదుటను, నీ ఎదుటను పాపిని' అన్నాడు.

తన ఎడమచేతిలోకి కొవ్వొత్తిని కుడిచేతిలో నుండి మార్చుకొని కుడిచేత్తో కుమారుని నొసలు స్పృశిస్తూ శిలువ గుర్తు వెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు గాని బలహీనత వలన అలా చెయ్యలేకపోతున్నాడు. 'ప్రభువా నీకు స్తోత్రము! ప్రభువా నీకు స్తుతి!' మూసుకుపోతున్న కండ్లతో ఇవాన్‌ని చూస్తూ 'ఇటు చూడు నాయనా!' అన్నాడు.

'ఏంటి నాయనా?' అన్నాడు ఇవాన్.

'ఇప్పుడు నీకు ఇల్లు లేదుకదా!' అన్నాడు. 'దేవుని ఆజ్ఞకి లోబడి జీవించు. నీవు సంతోషంగా జీవించి వృద్ధిలోకి వస్తావు. దీవించబడతావు'. కొంచెంసేపు మౌనంగా ఉండి చిన్నగా నవ్వి 'ఈ విషయంలో మౌనంగా ఉండు. ఈ గ్రామానికి నిప్పు ఎవరు పెట్టారో ఎవరికి చెప్పవద్దు. నీ పొరుగువాని పాపమును నువ్వు క్షమించు. యేసుప్రభువు నీ పాపములు క్షమిస్తాడు. ప్రభువు మీ ఇద్దరిని దీవించును గాక!' అని, తన చేతిలోని కొవ్వొత్తిని రెండు చేతులతో పట్టుకొని కండ్లు మూసుకొని ప్రాణం విడిచాడు.

ఇవాన్ తండ్రి యొక్క మాటప్రకారం గోర్గే గురించి గ్రామమునకు నిప్పుపెట్టిన సంగతి ఎవరికి చెప్పలేదు. చిన్నగా తన శత్రువు మీద కోపం పూర్తిగా పోయింది. ఎక్కువ తప్పు తనదే అనుకొనేవాడు. ఇవాన్ తన సంగతి ఎక్కడా చెప్పక పోవడం చూసి గోర్గే చాలా ఆశ్చర్యపోయాడు. మొదట్లో ఇవాన్ ను చూసి చాలా భయపడేవాడు. ఆ ఇద్దరు పొరుగువారు తగువులాడుకోవడం మానేశారు. కుటుంబ సభ్యులు వారిని అనుసరించారు. వారు క్రొత్త ఇండ్లు కట్టుకొనేటప్పుడు ఇద్దరు ఒకే ఇంట్లో నివశించారు.

చనిపోతూ తన తండ్రి చెప్పిన మాటలు ఇవాన్ జ్ఞాపకము చేసుకొనేవాడు. 'నిప్పును ఆదిలోనే ఆర్పివేయుము' తనకి ఎవరైనా కీడు చేస్తే ప్రతీకారం ఆలోచించేవాడు కాదు. తనని అనుసరించి నడుచుకోమని ఇంట్లో వారికి చెప్పేవాడు. ఇవాన్ ఇప్పుడు క్రొత్త వ్యక్తి. అతను సమాధానముగా జీవించి అభివృద్ధి చెందాడు.

**కనుక మనందరము సమాధానముతో జీవించాలంటే ఇతరుల యెడల ప్రేమ, కనికరము కలిగి ఉండాలి.**

# సువార్తికుడిగా జాన్ డేవిడ్

**అరుణ్‌కుమార్ కె. మహంతి, డైరెక్టర్, ఎ.ఎం.జి. ఇండియా ఇంటర్నేషనల్**

**క్రిస్టియన్ అసెంబ్లీస్ సువార్త దినోత్సవం అక్టోబరు 17న ఎందుకు? :-**

వాక్యానుసారము పరిశుద్ధుడైన పౌలు క్రీస్తు సాక్షిగా ఏటి ప్రాంతాలకు వెళ్ళాడు. ఆయన సాంఘిక, భౌగోళిక, సాంస్కృతిక విభేదాలను లెక్కచేయకుండా తన సువార్త సేవ కొనసాగించాడు. ఈ కార్యసాధనలో ఈయనకు ఎన్నో కష్టాలు, ఇబ్బందులు, అవాంతరాలు కలిగాయి. చివరకు మరణానికి గురి కావలసిన పరిస్థితి కూడా ఏర్పడింది.

దాదాపు రెండు దశాబ్దాలుగా దీనిని ఎ.ఎం.జి. వాళ్ళు సువార్త దినోత్సవముగా పాటించడం జరుగుతూ ఉంది. ఎందుకంటే ఇది సువార్తికుడైన జాన్‌డేవిడ్‌గారి జన్మదినోత్సవం కనుక.

**ఆయన జీవిత సంగ్రహం :-**

ఆయన 1926వ సంవత్సరం అక్టోబరు 17న జన్మించారు. ఈ సంవత్సరం సువార్త దినోత్సవం నిర్వహించే నాటికి ఆయనకు డెబ్భై ఎనిమిది సంవత్సరాలు. డెబ్భై తొమ్మిదవ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నారు. ప్రేమ పెల్లుబికి రాగా స్వతంత్ర్య పోరాటములో పాల్గొనాలని సుభాష్ చంద్రబోస్ స్థాపించిన సైన్యంలో చేరేటందుకు బర్మా దేశానికి బయలుదేరారు. మహాత్మాగాంధీపై గౌరవం లేక కాదు గాని బోస్ విధానాలతో అధికంగా ప్రభావితులయ్యారు. బోస్‌తో వ్యక్తిగత పరిచయం లభించక భారతదేశ సైన్యంలో చేరి పోయారు. సందేశాలను అందించే యువ బృందంలోకి స్వీకరించబడ్డారు. క్రమేపీ పదోన్నతి సాధిస్తూ ఢిల్లీనుండి బొంబాయి నగరానికి బదిలీ చేయబడ్డారు. బొంబాయిలో ఆయన యేసుప్రభువుని సొంత రక్షకునిగా అంగీకరించారు. బైబిల్ చదవనారంభించారు. సువార్త చేయాలి అనే తీరని దాహం ఏర్పడింది. ఆత్మీయంగా నశించిపోయే వారిని వెదకి రక్షించాలనే తాపత్రయంతో మిలటెరీ నుండి విడుదల పొందారు.

అప్పటికే విధవరాలైన తన తల్లికి చేదోడు వాదోడుగా ఉంటూ పరిశుద్ధమైన సువార్తసేవకు పూను కున్నారు. తొలిరోజులలో క్రీస్తు సాక్షిగా కాలినడకన దూరప్రాంతాలకు కూడా ప్రయాణంచేసారు. కొన్ని సంఘాల వారు ఆయనను ఆహ్వానించగా ఆయన నిర్మొహమాటంగా సువార్తనందించారు. సంఘాలు ఆయనను వెలివేశాయి. తన మాతృ సంఘంలోని వారు ఆయనపై విమర్శలు కురిపించి అవమానాలకు గురిచేశారు. అప్పుడు ఆయనకు పరిశుద్ధుడైన పౌలు రోమా 15:20లో వ్రాసిన "నేనైతే ఇతరుల పునాదిమీద కట్టకుండు నిమిత్తము" అను మాట గుర్తుకు వచ్చింది. దాని ఆధారంగా ఆయన సొంత సంఘాలు స్థాపించాలని కంకణం కట్టుకున్నారు. అక్కడ నుండి దీనిని ఆధారం చేసుకొని ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాలలో విస్తృతంగా ప్రయాణించారు. ఎక్కడికక్కడ సంఘాలను స్థాపించుకుంటూ వెళ్ళారు. వాటిలో కొన్ని స్థలాలు విస్సన్నపేట, చీరాల, స్టువర్టుపురం వగైరా, చిట్టచివరిగా చిలకలూరిపేటలో స్థిరపడ్డారు.

ఆయన భార్య పేరు డాక్టర్ సత్యవేదమ్మ. ఆమె ఒక భక్తిగల క్రైస్తవ వైద్యురాలు. ఆమె తల్లిదండ్రులు అన్నదమ్ములు ఆయనను వారి కుటుంబానికి పెద్దగా స్వీకరించారు. ఆమె ఆర్థిక సహాయంతో ఆయన నాటినుండి నేటివరకు అలుపెరుగని శ్రామికుడిలా సువార్త సేవ చేస్తున్నారు. దుర్మార్గులను సన్మార్గులుగా క్రీస్తులో విశ్వాసము ద్వారా మారుస్తున్నారు. మారిన వారిలో కొందరు మాకు బాప్తీస్మాలు ఇవ్వండి అని అడిగినప్పుడు ఆయన పెద్ద సంఖ్యలో బాప్తీస్మాలు ఇచ్చినప్పటికీ దానిని ఒక ప్రధానమైన ఆచారంగా పాటించలేదు. క్రైస్తవునికి అదొక గుర్తింపు కాబట్టి ఆ సంప్రదాయం మేరకు బాప్తీస్మాలు ఇచ్చారు. కానీ ఆయన అసలు గురి మాత్రం మనిషి. అంతరంగిక మార్పు మీద, మనస్సు మార్పిడి మీద, సాంప్రదాయ భాషలో చెప్పాలంటే మారుమనస్సు మీద.

ఈయన స్థాపించిన సంఘాలలోని సిద్ధాంతాలు మాత్రం సహోదర సంఘాలకు దగ్గరగా ఉంటాయి. పక్కా చర్చీలకు ప్రాధాన్యత లేదు. ఇంటింటా సంఘాలకు ప్రాధాన్యత హెచ్చు. పూరిపాకలో సంఘాలే ఎక్కువ! స్త్రీలకు

సంబంధించిన చర్చి కట్టుబాట్ల విషయంలో మరీ అంత పట్టింపుగా వ్యవహరించదు.

1968లో ఆయన మొదటిసారిగా అమెరికా దర్శించినపుడు ఎ.ఎం.జి. వ్యవస్థాపకులు, అధ్యక్షులు అయిన రెవరెండ్ డాక్టర్ స్పిరోజ్ జోడియాటిస్ గారి పరిచయం కలిగింది. ఆయన జాన్‌దేవిడ్ గారి సువార్త పనిని విస్తారంగా ప్రోత్సహించారు. దానిని పురస్కరించుకొని జాన్‌దేవిడ్‌గారు, ఏ పేరూ లేకుండా అప్పటివరకూ ఆయన చేస్తున్న సువార్త సేవలన్నింటికీ ఎ.ఎం.జి. అని పేరు పెట్టారు. ఎ.ఎం.జి. అంటే ఇంగ్లీష్ - ఎడ్వాన్సింగ్ ద మినిస్ట్రీస్ ఆఫ్ ది గాస్పెల్ అనగా సువార్త సేవల కొనసాగింపు అని అర్థం.

మొదట అది ఎడ్వర్టైయిజింగ్ ద మెసేజెస్ ఆఫ్ ద గాస్పెల్‌గా ప్రారంభమైంది. అనగా లౌకిక పత్రికల ద్వారా సువార్త ప్రకటనలు ప్రకటించడం. ఆంధ్రజ్యోతి అనే వారపత్రికలో “ముత్యాల సరాలు” అనే పేరుతోను ఆంధ్రప్రభ ప్రగతి వారపత్రికలో “రత్నాల రాసులు” అనే పేరుతోనూ ప్రచురితమయ్యాయి. దీనికి సంబంధించిన కార్యాలయం ప్రస్తుతం విశాఖపట్నంలో నిర్వహించబడుతూ ఉంది. ఆ తరువాత అదే కార్యాలయంలో ప్రసంగ సహకారి అనే మాసపత్రిక సొంతంగా ప్రారంభించారు. జానే దేవిడ్‌గారు ప్రారంభించిన ఈ సువార్త సేవ వివరాలు సాహిత్యసేవ అనే శీర్షికలో మరో పుస్తకంలో చదువవచ్చు.

ఈ సేవా కార్యక్రమాలు ఎ.ఎం.జి. పేరుతో వ్యవహరించబడుతున్నా ఇది ఏ విదేశీ సంస్థకు ఇండియా శాఖ కాదు. ఇది ఇండియాలో పుట్టిన నిఖార్సైన స్వదేశీ సంస్థ. జాన్‌దేవిడ్‌గారితో మనసు, చేతులు కలిపి పనిచేస్తున్న వారితో ఒకే ఆశయసాధన జరుగుతున్న సేవలు కనుక దీనికి ఆయన ఎ.ఎం.జి. ఇండియా ఇంటర్నేషనల్ అని నామకరణము చేశారు.

ఆయన స్పురదృష్ఫి, ఏక సంథాగ్రాహి. వేదికమీద కెక్కి పరిశుద్ధ గ్రంథం విప్పి చెప్పనారంభించారంటే ఆ ప్రసంగాలు అనర్గళంగా సాగిపోతాయి. పండ్లు, గుండ్లు దొరలినట్లు ఉంటుంది. పరిశుద్ధాత్మ ఆవేశ పూరితుడై ఆయన ప్రసంగిస్తూ ఉంటే వినేవారు నిర్ఘాంతపోతారు. పూర్తయేంత వరకు కన్నార్పరు. అలాంటి ప్రసంగ ధోరణి ఏ కొద్దిమందికో తప్ప, అందరికీ సాధ్యపడదు. ఇది ఆయనకు పరిశుద్ధాత్మ ప్రత్యేకంగా ప్రసాదించిన వరం. సాధారణంగా అందరికీ లభించని అపురూపమైన తలాంతు. బాప్తీస్మమిచ్చు యోహాను గురించి లేఖనాలలో వ్రాయబడిన ఒక వాక్యం ఆయనకు సరిగ్గా సరిపోతుంది. “అతడు పుట్టినందు వలన అనేకులు సంతోషింతురు” లూకా 1:17

**సువార్త దినోత్సవం ఎలా జరుగుతుంది?**

ప్రతి సంవత్సరం అక్టోబరు 17న జరిగే సువార్త దినోత్సవం సర్వసాధారణంగానూ, నిరాడంబరంగానూ, ఉంటుంది. ఇది పవిత్రమైన కార్యక్రమము కనుక సాంస్కృతిక కార్యక్రమాలు ఉండవు. ఈ ఉత్సవం 14వ తేదీ నుండే ప్రారంభమౌతుంది. క్రిస్టియన్ అసెంబ్లీస్‌ని నిర్వహిస్తున్న సేవకులంతా 14వ తేదీన చిలకలూరిపేటకు చేరుకుంటారు.

ప్రసిద్ధి గాంచినటువంటి దైవజనులు వాక్య పరిచర్య నిమిత్తం ఆహ్వానించబడతారు. ఈ నాలుగు రోజులు సువార్త శిబిరంలో సంవత్సరమంతా చేసిన పనిని పరిశీలన గా విని, విశ్లేషణ చేసి పరిపూర్ణ ఉజ్జీవంతో సేవకులను నింపి మళ్ళీ వాళ్ళ వాళ్ళ స్వస్థలాలకు పంపడం జరుగు తుంది. స్తుతిగీతాలు, ప్రార్ధనలు, ప్రకటనలు, విజ్ఞాపనలు, వాక్య ధ్యానాలు ఈ నాలుగు దినాలలో విస్తారంగా జరుగుతాయి.

ఈ సభలకు విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ప్రాంతాల లో ఎ.ఎం.జి. క్రిస్టియన్ అసెంబ్లీలను నిర్వహిస్తున్న సేవకులంతా ఒక్కసారి స్నేహపూర్వకంగా కలుస్తారు. ఒక ప్రాంతంవారు సువార్తలో వారి అనభవాలను ఇతర ప్రాంతాల వారితో పంచుకుంటారు. ఏరియ ఎల్డర్స్ తమతమ సంవత్సరిక రిపోర్టులను ప్రాంగణమంతా ప్రతిధ్వనిస్తుం టుంది. సేవకులు అనుమానాలు తీర్చుకోవడానికి క్రొత్త విషయాలు నేర్చుకోవడానికి ప్రశ్నోత్తరాల సమయం ఉంటుంది. ఏ పూట కాపూట వివిధరుచుల వంటకాలతో శారీరక పోషకాహారం వడ్డించబడుతుంది. పుష్కలంగా ఆత్మీయ ఆహారం లభిస్తుంధి.

# బీదలను కటాక్షించువాడు ధన్యుడు

3

**శ్రీ బొకినాల ఇశ్రాయేలు – వారి సహచరులు**

అయితే, ఇచ్చట గమనించవలసిన ముఖ్య విషయ మేమిటంటే – మార్కు 10:43,45,47లో ప్రభువే స్వయంగా తనను వెంబడించుచున్న భక్తులను ఉద్దేశించి ఈ మాటలు చెప్పారు – "పాపము చేయకుండా ఉండాలని మీరు ప్రయత్నం చేస్తుండగా" మీ చెయ్యి అభ్యంతరపరిస్తే దానిని నరికివేయండి; మీ పాదము అభ్యంతరపరిస్తే దానిని నరికివేయండి; మీ కన్ను అభ్యంతరపరిస్తే దానిని తీసి పారవేయండి" తన భక్తులు నిజానికి తమ చెయ్యిని, పాదాన్ని తప్పకుండా నరికివేయాలని, కంటిని పెరికివేయాలని ప్రభువు యొక్క ఉద్దేశ్యం కాదు. పాపము చేయాలని వారిని ప్రోత్సహిస్తున్న ఆ అవయవాల విషయమై వారు అంత తీవ్రంగా స్పందించాలనీ, తద్వారా పాపము చేయకుండా ఉండాలని ప్రభువు యొక్క ఉద్దేశ్యమై ఉంటుందని మనము అభిప్రాయపడాలి.

అలాగే "బీదలు ఇచ్ఛయించిన (కోరిన) దానిని నేను బిగబట్టినయెడల (ఇవ్వనియెడల), వస్త్రహీనునికి నేను బట్టలు ఇవ్వని యెడల" నా భుజము తన గూటినుండి పడునుగాక! నా చెయ్యి విరిగిపోవునుగాక! అని ఆనాటి భక్తుడైన యోబు అనుకొనినట్లు ఈనాటి భక్తులైన క్రైస్తవులు కూడా అనుకోవాలని దేవుని ఉద్దేశ్యం కాదు. వారు బీదలకు సహాయం చేయలేకపోతున్న తమ మనస్సు విషయంలో బాధపడాలనియు, అంత తీవ్రముగా స్పందించాలనియు దేవునియొక్క ఉద్దేశ్యమై ఉంటుందని మనము అభిప్రాయ పడాలి. అంతేగానీ నిజంగా గూడ జారిపోవాలని (లేక) చెయ్యి విరిగిపోవాలని కోరుకోవాలని కాదు!

ఈ సందర్భంగా గమనించాల్సిన మరో విషయం ఏంటంటే – బీదలకు సహాయపడమని కోరుచున్న దేవుడే బీదలు అడిగిన దానినల్లా ఇవ్వమని చెప్పుటలేదు! ఎలాగనగా – సామెతలు 3:17లో "మేలు చేయుట నీ చేతనైనప్పుడు దాని పొందదగిన వారికి చేయకుండా వెనుకకు తియ్యకుము" అని దేవుని వాక్యం సెలవిస్తోంది. కావున, సహాయం చేయుటకు ఇష్టపడే క్రైస్తవులు విచక్షణా జ్ఞానము గలవారై మేలు (సహాయము) చేయవలసియున్నది. ఎందుకంటే, "దానిని పొందదగిన వారికి" మాత్రమే చేయాలని దేవుని ఆజ్ఞయై యున్నది గదా? ఉదా॥ ఎవరన్నా బీదవాడు (....) అయ్యా! నాకు ఒక కిడ్నీని సాయం చేయుము లేక ఒక కంటిని దానం చేయుము (లేక) మీకున్న ఇండ్లలో ఒక ఇంటిని నాకిమ్ము అని అడిగాడనుకోండి! అలాంటి అవయవాలను, వస్తువులను దానం చేయమని, ధర్మం చేయమని దేవుని వాక్యములో వ్రాయబడి లేదు కదా! కావున, అలాంటి కోర్కెలు కోరిన బీదలకు (....) ఈ విషయం వివరంగా చెప్పి, వారిని తగిన విధంగా ఓదార్చ వలసినదే గానీ కిడ్నీలను, కండ్లను, ఇండ్లను దానంగా, ధర్మంగా ఇమ్మని కోరగానే ఇచ్చివేయటం అంతమంచిది కాదు సుమా!

ఈ సందర్భంలో సామెతలు 11:15లో వ్రాయబడి యున్న దేవుని వాక్యమగు "ఎదుటివాని కొరకు పూటబడిన వాడు చెడిపోవును" అనే వాక్యమును దృష్టిలో ఉంచుకో వలసియున్నది. అంటే, బీదలకు (....) సహాయపడాలని క్రైస్తవులు ఆశించినా ఆ బీదలు (....) అడిగిన ఆ సహాయాన్ని వారు పొందటానికి అర్హులేనా? అని ఆలోచించకుండా ఎడా – పెడా సహాయం చేయరాదు. అట్లు చేసినచో సహాయం చేయుచున్న క్రైస్తవులు చెడిపోతారన్నమాట (నష్టపోతా రన్నమాట). కాబట్టి, మేలు (సహాయము) చేయాలని ఆసక్తి గలవారై యుంటూనే ఆ సహాయాన్ని అడిగినవారిని గూర్చియు జాగ్రత్తగా యోచించవలసిన బాధ్యత కూడా క్రైస్తవులకున్నది! కాబట్టి, ఏ సహాయాన్నైనా ప్రార్థనా పూర్వకంగా మాత్రమే చేయవలసియున్నది సుమా!

**డి) మనుష్యులు బీదలుగా (....) జన్మించుటకు (లేదా) వారు ఆవిధంగా అగుటకు గల కారణములను గూర్చి దేవుని వాక్యానుసారంగా తెలుసుకుందాం :**

**1.** బీదలగుటకు (....) త్రాగుబోతుతనము, తిండి బోతుతనము ఒక కారణము :

త్రాగుబోతులును, తిండిబోతులును దరిద్రు లగుదురు (సామెతలు 23:31)

**2.** బీదలగుటకు (....) వ్యర్థమైన వాటిని అనుస రించుట ఒక కారణము :

వ్యర్థమైన వాటిని అనుసరించువారికి కలుగు పేదరికము ఇంతంత కాదు (సామెతలు 28:19)

**3.** బీదలగుటకు (....) బద్ధకముగా పనిచేయుట ఒక కారణము :

బద్ధకముగా పనిచేయువాడు దరిద్రుడగును (సామెతలు 10:4)

**4.** బీదలగుటకు (....) సోమరితనము, నిద్రబోతు తనము ఒక కారణము :

సోమరీ ఎందాక నీవు పండుకొనియుందువు? ఎప్పుడు నిద్రలేచెదవు? ఇంకొంచెము నిద్రించెదనని, కొంచెము కునికెదనని, కొంచెముసేపు చేతులు ముడుచుకొని పరుండెదనని నీవనుకొనుచుందువు. అందుచేత దోపిడిగాడు వచ్చునట్లు దారిద్ర్యము నీ యొద్దకు వచ్చును (సామెతలు 6:9-11) సోమరి ఆశపడునుగాని వాని ప్రాణమునకేమియు దొరకదు. సోమరి పస్తుపడి యుండును (సామెతలు 13:4).

**5.** బీదలగుటకు (....) దేవుని యొద్ద దొంగిలుట ఒక కారణము :

అయితే మీరు నీ యొద్ద దొంగిలితిరి. దేని విషయములో మేము దొంగిలితిమని మీరందురు. పదియవ భాగమును, ప్రతిష్ఠార్పణలను ఇయ్యక దొంగిలితిరి. ఈ జనులందరు నా యొద్ద దొంగిలిచుచునేయున్నారు, మీరు శాపగ్రస్తులై యున్నారు (మలాకీ 3:8,9)

**6.** బీదలగుటకు (....) 'దేవుని చిత్తము' కూడా ఒక కారణము :

యెహోవా దారిద్ర్యము... కలుగజేయువాడు, కృంగజేయువాడును... ఆయనే (1సమూయేలు 2:7)

పై వాక్యాలను బట్టి చూడగా మనుష్యుల యొక్క వ్యక్తిగత చెడ్డఅలవాట్ల వలన, సోమరితనము వలన, దేవునికి ఇయ్యవలసిన దశమభాగములు, కానుకలు, అర్పణలు ఇవ్వకపోవుట వలన మరియు కొందరిపట్ల దేవుని చిత్తము చొప్పున కూడా మనుష్యునికి బీదరికము (....) కలుగు చున్నది.

**ఇ) మరైతే, క్రైస్తవులు బీదలకు (....) తప్పనిసరిగా సహాయం చేయవలెననుటను గురించిన కొన్ని దేవుని ఆజ్ఞలను తెలుసుకుందాం :**

**1.** ప్రతి క్రైస్తవుడు బీదలకు (....) తన చేతిని చాపాలి:

అందుకే, ద్వితియో 15:11లో దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపించుచున్నది - బీదలు దేశములో ఉండకమానరు. అందుచేత నేను నీ దేశములోనున్న నీ సహోదరులగు దీనులకును, బీదలకును, అవశ్యకముగా నీ చెయ్యి చాపవలెనని నీ కాజ్ఞాపించుచున్నాను.

**2.** ప్రతి క్రైస్తవుడు తనకిష్టమైనప్పుడెల్లా బీదలకు (....) మేలు చేయాలి :

అందుకే, మత్తయి 26:11లోను, మార్కు 14:7లోను దేవుని వాక్యము ఈవిధంగా ఆజ్ఞాపిస్తున్నది - బీదలెల్లప్పుడు మీతో కూడా ఉన్నారు. మీకిష్టమైనప్పుడెల్లా వారికి మేలు చేయవచ్చును.

**3.** ప్రతి క్రైస్తవుడు తనకు కలిగినవన్ని అమ్మి బీదలకు (....) ఇవ్వాలి :

అందుకే, మార్కు 10:1లో దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది - నీవు వెళ్ళి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము.

**4.** ప్రతి క్రైస్తవుడు బీదలకు (....) అప్పు ఇవ్వాలి. కానీ వడ్డీ తీసుకొనకూడదు :

అందుకే, ద్వితియో 15:8లోను, నిర్గమ 22:25 లోను దేవునివాక్యము ఈవిధంగా ఆజ్ఞాపిస్తున్నది - నీ చెయ్యి ముడుచుకొనక వానికొరకు అవశ్యముగా చెయ్యిచాపి వాని అక్కరచొప్పున ఆ అక్కరకు చాలినంత అవశ్యముగా వానికి ఇప్పింపవలెను. నా ప్రజలలో నీయొద్దనుండు ఒక బీదవానికి సొమ్ము అప్పిచ్చినయెడల వడ్డీకిచ్చు వానివలె వానియెడల జరిగింపకూడదు. వానికి వడ్డీ కట్టకూడదు.

# బైబిలునందలి గ్రంథములు, గ్రంథకర్తలు

ప్రసంగ సహకారి సౌజన్యంతో...

బైబిలునందలి అరవై ఆరు పుస్తకాలను యూదా జనాంగమునకు చెందిన నలభై గ్రంథకర్తలు వ్రాసిరి. మొదటి పుస్తకము వ్రాయబడిన కాలమునకు చివరి పుస్తకము వ్రాయబడిన కాలమునకు మధ్య సుమారు పదహారు వందల సంవత్సరాలు గడిచినవి. బైబిలులోని ప్రతి పుస్తకము యొక్క శీర్షికయందు ఆ గ్రంథకర్త పేరుదహరింపబడెను. కాని కొన్ని పుస్తకముల గ్రంథకర్తలుగా సూచించిన పేర్లు గలవారు అసలు గ్రంథకర్తలు కారని పలువు రభిప్రాయపడుచున్నారు.

ఉదాహరణముగా బైబిలునందలి మొదటి ఐదు పుస్తకము లను మోషే వ్రాసెనా? లేదా? అను ప్రశ్నకు, అవునని కొందరు, కాదని మరికొందరు తలంచుచున్నారు. ఈ రీతిగా బైబిలులోని చాలా పుస్తకాల గ్రంథకర్తల విషయమై పెక్కు అభిప్రాయబేధములు గలవు. అట్టి వివాదాంశములను నేను వదిలి వేయుచున్నాను. వీటి విషయమై బైబిలు విద్యార్థు లైనవారు, బాగుగా పరికించి తమకైతామే నిర్ధారణ చేసుకొన వలెనని నా అభిప్రాయము.

**1. కాలం :** బైబిలులోని పుస్తకాలన్నిటిలో యోబు గ్రంథము మొదట వ్రాయబడెననియు, అది వ్రాయబడిన కాలము క్రీ.పూ.1500 సంవత్సరాలనియు చాలామంది భావింతురు. అన్నిటికంటే చివరగా ప్రకటన గ్రంథము వ్రాయబడెననియు భావింతురు. కావున ఈ రెండు పుస్తకములకు మధ్యనున్న కాలము సుమారు పదహారు వందల సంవత్సరములుగా లెక్కింపబడుతున్నది. అనగా బైబిలు యావత్తు సుమారు అరవై తరముల కాలములో వ్రాయబడెనని భావింపబడుతున్నది.

**2. గ్రంథకర్తలు :** ఈ అరవై ఆరు పుస్తకములలో, పాత నిబంధనయందు గల ముప్పై తొమ్మిది పుస్తకములందు ఎక్కువ సంఖ్యగల పుస్తకములను మోషే వ్రాసినట్లు చూడ గలము. క్రొత్త నిబంధనయందు గల ఇరవై ఏడు పుస్తకము లలో ఎక్కువ సంఖ్యగలవాటిని పరి.పౌలు వ్రాసినట్లు కనుగొనగలము. మోషే మొదటి ఐదు పుస్తకములను, పరి.పౌలు పదమూడు పుస్తకములను, అనగా రోమా పత్రిక నుండి ఫిలోమోను పత్రిక వరకు వ్రాసెను. హెబ్రీ పత్రికను పౌలు వ్రాసెనని కొందరు, వ్రాయలేదని మరి కొందరు తలంతురు. ఇదియు వివాదాస్పద విషయమే. కీర్తనల గ్రంథములో చాలా భాగము రాజైన దావీదు వ్రాసినట్లు భావింపబడుచున్నది. ఈ పుస్తకమందు గల నూట యాభై కీర్తనలలో, రాజైన దావీదు డెబ్బై మూడు కీర్తనలను వ్రాసినట్లును, మిగిలిన వాటిలో ఆసాపు పన్నెండు కీర్తనలను, కోరహు కుమారులు పదకొండు కీర్తనలను, రాజైన సొలోమోను రెండు కీర్తనలను, ఏతాను ఒక కీర్తనను, మోషే ఒక కీర్తనను వ్రాసిరనియు మిగిలిన యాభై కీర్తనలను వ్రాసిన వారిపేర్లు తెలియుటలేదని భావింపబడుచున్నది. సామెతలు, ప్రసంగి, పరమగీతము అనువాటిని సొలోమోను వ్రాసెను. లూకా సువార్త, అపోస్తలుల కార్యముల గ్రంథము లను సువార్తికుడగు లూకా వ్రాసెను. యోహాను సువార్త, యోహాను భక్తకోటికి వ్రాసిన మూడు పత్రికలు, ప్రకటన గ్రంథమును పరి.యోహాను వ్రాసెను. దీనిని బట్టి ఒక విషయము తెలియుచున్నది. పండితులు, పామరులు, రాజులు, సామాన్య ప్రజలు అనగా అన్ని తరగతుల ప్రజలు ఈ పుస్తకములను పరిశుద్ధాత్మ ప్రేరితులై వ్రాసిరి. అంతేగాక ఈ గ్రంథకర్తలు ఎట్టివారో కొంత విచారింతుము.

| | | |
|---|---|---|
| మోషే | – | పశువులకాపరి |
| యెహోషువ | – | సైనికుడు |
| సమూయేలు | – | ప్రవక్త |
| దావీదు | – | రాజు |
| సొలోమోను | – | తత్వశాస్త్రి |
| ఆమోసు | – | పశులకాపరి |
| దానియేలు | – | రాజకీయవేత్త |
| ఎజ్రా | – | లేఖకుడు |
| మత్తయి | – | సుంకపు గుత్తదారుడు |
| లూకా | – | వైద్యుడు |

| | | |
|---|---|---|
| పేతురు | - | జాలరి |
| యాకోబు | - | జాలరులు |
| యోహాను | - | జాలరి |
| పౌలు | - | గొప్ప విద్యావంతుడు |

వేర్వేరు పరిస్థితులకు, వివిధ రంగములకు చెందిన ఈ వ్యక్తులు వ్రాసిన పుస్తకములు బైబిలునందు చేర్చుటయే గాక, ఈ పుస్తకములన్నియు ఒకే సందేశమును గత రెండు వేల సంవత్సరాల నుండి ప్రజలకు అందజేయుట బహు అద్భుత విషయము. ఈ రీతిగా రాజులు, రాజకీయవేత్తలు, ధర్మశాస్త్రోపదేశకులు, పండితులు, పామరులు, కర్షకులు, గొర్రెల కాపురుల, జాలరులు మొదలగువారు ఈ బైబిలు గ్రంథమందలి వేర్వేరు పుస్తకములను వ్రాసిరి. మోషే, సమూయేలు, దావీదు, సొలోమోను, యెషయా మొదలగు ప్రవక్తల ద్వారా దేవుడు ప్రజలతో మాటలాడెను. ఎట్లనగా 'పూర్వకాలమందు నానా సమయాలలోను, నానా విధములు గాను, ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను' హెబ్రి 1:1,2

**3. ఎచట వ్రాసిరి? :** బైబిలునందలి అరవై ఆరు పుస్తకములు వివిధ స్థలములలో వ్రాయబడెను. సీనాయి పర్వతము, యూదా అరణ్యము, షూషనుకోట, చీబారునది ఒడ్డు, సీయోను పట్టణము, రోమా చెరసాల, పత్మాసులంక మరి ఇతర స్థలములలో ఇవి వ్రాయబడెను. ఇంతేగాక ఈ గ్రంథకర్తలు వివిధ దేశములకు చెందియుండిరి. ఒకడు సిరియానుండి, ఒకడు అరేబియానుండి మరొకడు గ్రీసు నుండి వేరొకడు ఇటలీనుండి వ్రాసెను. ఇవిగాక మిగిలిన వాటిలో చాలా భాగము పాలస్తీనాలో వ్రాయబడెను.

**4. ఇందేమి గలదు? :** బైబిలునందు సంపూర్ణ సారస్వతమును, వాఙ్మయమును గలదు.

ఆదికాండములో జీవితకథలు, లేవీయకాండము లో కర్మకాండలు, ద్వితియోపదేశకాండములో గొప్ప బోధలు, రూతు గ్రంథములో గొప్ప ప్రేమగాథ, సమూయేలు, రాజులు, దినవృత్తాంత గ్రంథములలో దేశచరిత్ర, యోబులో నాటకము, కీర్తనల గ్రంథములో భక్తిరసపూరిత భజన కీర్తనలు, సామెతలలో నీతిశాస్త్రము, ప్రసంగిలో తత్వ శాస్త్రము, పరమగీతములో ప్రేమపాట, యోవేలునుండి హబక్కూకు వరకు ఆనందగీతము, యెషయా యిర్మియా, యెహెజ్కేలు గ్రంథములలో ప్రవచనములు, సువార్తలలో యేసుప్రభువు జీవితచరిత్ర, అపోస్తలుల కార్యముల గ్రంథములో సంఘచరిత్ర, పత్రికలలో క్రైస్తవ మూల సిద్ధాంతములు, దానియేలు, ప్రకటన గ్రంథములలో భవిష్యద్విషయములను తెలుపు సంగతులు గలవు.

**5. వారెట్లు వ్రాసిరి? :** ఈ పుస్తకములలో చాలా భాగము బహు కష్టపరిస్థితులలో వ్రాయబడెను. ఆ కాలమందు వ్రాయుటకు సరియగు పరికరములులేవు. మనమిపుడు వాడుచున్న వ్రాత వస్తువులు ఆ కాలమందు లేవు. యిర్మియా కాలమునందు వ్రాతకు సిరా యున్నట్లు యిర్మియా 36:18ని బట్టి తెలియుచున్నది. చమురు దీపపు వత్తినిగాని, క్రొవ్వొత్తిని గాని వారు దీపముగా వాడిరి. బైబిలు గ్రంథమును ఎట్టివారు వ్రాసినను, ఏయే పరిస్థితులలో వ్రాసినను వారందరు పరిశుద్ధాత్మ ప్రేరితులై వ్రాసిరనుటకెట్టి సందేహము లేదు "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని సహాయము చేత పలికిరి" (2 పేతురు 1:21).

అంతేగాక "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవా వేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది." (2 తిమోతి 3:16,17).

**6. ప్రవచనములు, వాటి నెరవేర్పు :** పాత, క్రొత్త నిబంధనల యందు చాలా ప్రవచనములు గలవు. ఈ ప్రవచనములు కొన్ని వందల సంవత్సరముల పిమ్మట నెరవేరెను. ఉదాహరణముగా పాతనిబంధనలో యేసు ప్రభువు యొక్క జన్మము, జీవితము, మరణ పునరుత్థానము లను గూర్చి కొన్ని వందల సంవత్సరాల క్రిందట ప్రవచింప బడెను. అవన్నియు క్రొత్తనిబంధనలో నెరవేరినట్లు చూడ

గలము. యూదా జనాంగమందు బెత్లేహేములో క్రీస్తు జన్మించునని మీకా. 5:2లో ప్రవచింపబడెను. దాని నెర వేర్పును మత్తయి 2:1–8లో మనము చూడగలము.

క్రీస్తు జన్మవిధానము యెషయా 7:14లో క్రీస్తు నమ్మకమైన సేవకుడుగా ఉదహరించబడెను. ఆ విషయము లన్నియు మత్తయి 12:14–21లో నెరవేరెను.

ఆయన రాజైనను, దీనుడై గార్దభపు పిల్లను ఎక్కి వచ్చునని జెకర్యా 9:9లో ప్రవచింపబడెను. దాని నెరవేర్పు మత్తయి 21:1–11, మార్కు 11:1–10లో చూడగలము.

అంతేగాక, గొర్రెల కాపరి కొట్టబడుననియు, గొర్రెలుచెదరిపోవుననియు జెకర్యా 13:7లో గలదు. దాని నెరవేర్పు మత్తయి 26:31లో గలదు.

22వ దావీదు కీర్తనలో "నాదేవా, నాదేవా, నన్నెందుకు విడనాడితివ"ని వ్రాయబడెను. దాని నెరవేర్పును మత్తయి 27వ అధ్యాయమందును, యోహాను 19వ అధ్యాయమందును చూడగలము.

ఆయన పునరుత్థానమును గూర్చి కీర్తనలు 16:9,10లో గలదు. ఆ పునరుత్థాన చరిత్రను నలుగురు సువార్తికులు వ్రాసిరి.

ఇట్లు పాతనిబంధనలో ఎన్నో ప్రవచనములు గలవు. మరియు క్రొత్తనిబంధనలో కూడా చాల ప్రవచనము లు గలవు. రాబోవు కాలమందు జరుగనైయున్న విషయము లను గూర్చి చాలా సంగతులు తెలుపబడెను.

వాటిలో కొన్ని నెరవేరెను, మరికొన్ని ప్రస్తుతము నెరవేరుచున్నవి, ఇంకను కొన్ని నెరవేరనైయున్నవి. "ఏలయనగా, ఓర్పువలనను, లేఖనములవలన ఆదరణ వలనను, మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధకలుగునట్లు వ్రాయబడి యున్నవి (రోమా 15:4).

అంతేగాక దైవవాక్యమింకను ఇట్లు చెప్పుచున్నది. "ఈ సంగతులు దృష్టాంత రూపకములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను" (1 కొరింథి 10:11).

**3వ పేజి తరువాయి భాగం**

ఎందుకు? ఇకమీదట మీ ఇంటికి ఏ సువార్తికుడు వచ్చినా అతనికి ఘనమైన రీతిలో చందా ఇచ్చి అప్పుడు ప్రార్థించ మని అడగండి' అని చెప్పాను.

సారెపతు గ్రామములో ఉన్న విధవరాలు చాలా బీదది. ఆమెను ఆమె కుటుంబమును పోషించడానికి ఏలియాని ప్రభువు అక్కడికి పంపించాడు. కనుక ఏలియా ఆమె దగ్గరికి వెళ్ళినప్పుడు – మేము చావకముందు నేను ఇంటికి పోయి ... నాకును నా బిడ్డకును చేసుకొనవలెనని కొన్ని పుల్లలు ఏరుటకు వచ్చితిననెను.

అప్పుడు ఏలియా ఆమెతో భయపడవద్దు. పోయి నీవు చెప్పినట్లు చేయుము. అయితే అందులో నాకొక చిన్న అప్పము మొదట చేసి తీసుకొనిరమ్ము అన్నాడు. ఆమె దీవించబడవలెనంటే ఆమె ముందు ఏలియాకు ఓ అప్పము చేసి ఇవ్వవలసి వున్నది. ఇవ్వడం చేతకాని వారికి తీసుకోవ డానికి ఏమి ఉండదు.

కనుక నా చేతికి వచ్చినది చిన్నదైనా పెద్దదైనా అందులోనుండి కొంత దైవజనులనబడిన వారికిగాని అవసరత కలిగినవారికి గాని పంపించినపుడే నా అవసరతలు ప్రభువు తీర్చడం గమనించాను. కనుక ధనము నా వద్దకు పంపబడి నపుడు అదంతా నాదికాదని ముందుగా దానిలో ఎవరికెంత ఇవ్వవలసిఉన్నదో అది తెలియపరచబడేంత వరకు వేచివుంటాను.

**ప్రసంగములు పత్రికలో ప్రచురణ కొరకు పంపవద్దు**

## క్విజ్ నవంబర్ నెల ప్రశ్నలు 79

పాఠకులను వాక్యపు జ్ఞానంలో
పెంచటమే
ఈ శీర్షిక ఉద్దేశ్యం.

యిర్మియా 11 - 20వ అధ్యాయము వరకు

**1. జంతువులు , పక్షులు అంతరించి పోవుచున్నవని పర్యావరణ వేత్తలు వాపోవుచున్నారు. దానికి ప్రభువు చెప్పు కారణమేమి?**

**2. యిర్మియాను దేనితో కొట్టవలెనని జనులు చెప్పుకొన్నారు?**

## అక్టోబర్ నెల ప్రశ్నలకు జవాబులు;

**1.** బాధకును, శ్రమకును కారణమేమి?

**జవాబు:** యెహోవాను విసర్జించుట ఆయన యెడల భయభక్తులు లేకుండుట

**(యిర్మియా 2 : 19)**

**2. పితరులకిచ్చిన దేశములో కాపురము ఉండనిచ్చుటకు యూదావారు చెయ్యవలసిన - పది కాదు ఐదు పనులేవి?**

**జవాబు:** 1. క్రియలు చక్కపరచుకొనవలెను.
2. పొరుగువాని యెడల న్యాయము జరిగించాలి.
3. పరదేశులను, తండ్రిలేనివారిని, విధవరాండ్రను బాధింపకూడదు.
4. నిర్దోషి రక్తము చిందింపకూడదు.
5. అన్యదేవతలను అనుసరింపకూడదు.

**(యిర్మియా 7:5-7)**

**జవాబులు ప్రయత్నించినవారు :**

**శ్రీమతి కొండేటి సులోచనా దేవి (ఒంగోలు)**
**శ్రీమతి పి.యమ్. సుశీలా రాజారావ్ (సత్తుపల్లి)**
**శ్రీమతి టి. క్రిష్టియానమ్మ (నందికొట్కూరు)**
**శ్రీ యం.ఎస్. కృష్ణమూర్తి (చీరాల)**

## ఈ నెల పోషకులు :

సెప్టెంబర్ 20 నుండి అక్టోబర్ 20, 2011 వరకు మాకు చేరినవి.

| | | |
|---|---|---|
| శ్రీ నిమ్మగడ్డ సుధీర్ | హైదరాబాదు | 3000 |
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | హైదరాబాదు | 2000 |
| రెవ. షాలేమ్ విక్రాంత్ వర్ధన్ | గుంటూరు | 1500 |
| శ్రీమతి కమలా హ్యారీ బెన్నిసన్ | బెంగుళూరు | 1000 |
| శ్రీమతి తైయ్యల ప్రశాంతకుమారి | వెంకటగిరి | 1000 |
| శ్రీమతి చంద్రకళ బోయజు | ఒంగోలు | 1000 |
| శ్రీమతి సంపూర్ణ సాల్మన్ రాజు | నర్సారావుపేట | 1000 |
| శ్రీమతి విక్టోరియా రుక్మిణి | హైదరాబాదు | 1000 |
| డా॥ జడ్.సి. దేవదానం | కర్నూలు | 1000 |
| శ్రీమతి పద్మాడానియేలు పిళ్ళై | హైదరాబాదు | 1000 |
| శ్రీమతి ప్రసన్న భారతి | ఒంగోలు | 500 |
| అపోస్తులుడైన ఎబినేజరు | హైద్రాబాదు | 500 |
| శ్రీమతి సుశీలా రాజారావ్ | సత్తుపల్లి | 500 |
| పాస్టర్ భగవాన్‌దాస్ | కదిరి | 300 |
| శ్రీ తెంటు శేఖర్ | విజయవాడ | 200 |
| శ్రీమతి కూచిపూడి సౌభాగ్యమ్మ | ఒంగోలు | 200 |
| శ్రీ జంగాల ఆనందం | ఒంగోలు | 200 |
| శ్రీ సుందరరావు | ఎర్రగొండపాలెం | 200 |
| శ్రీ కొడమల ఏలియ | బిలాయ్ | 200 |

**హైదరాబాద్ అల్వాల్ నుండి 11.10.11 న ఒక పాఠకులు 1500 , పులివెందుల నుండి 1500 24.10.11 ఆన్‌లైన్ లో పంపినారు. దయచేసి వారు ఫోన్‌లో వివరాలు తెలపండి.**

పెద్ద కథ

# విశ్వాసంలో మరో మెట్టు

24

కంప్యూటర్ కొనడానికి వై.యస్.పురుషోత్తమ రెడ్డిగారు డబ్బులు ఇస్తే ప్రింటర్ కొనుక్కోవడానికి ఆయన రెండవ కుమారుడు డా॥ థామస్ రెడ్డి, అనురాధగారలు డబ్బులు ఇచ్చారు. ఆ డబ్బులు తన రెండవ కుమారునికి ఇస్తే పదివేల రూపాయల ప్రింటర్‌ని తీసుకొని వచ్చాడు. ఇప్పుడు సామ్యేలు ఆఫీసులో – ఆఫీస్ అనిపించుకోవాల్సిన అన్ని వస్తువులను ప్రభువు సమకూర్చారు.

విజయచంద్ర, మంజుల – సామ్యేలు రెండవ తమ్ముడు అతని భార్య. వీరు బెంగుళూరులో గొప్ప సేవ చేస్తున్నారు. విజయచంద్ర షష్ఠిపూర్తి అయినప్పుడు సెప్టెంబరు నాలుగవ తారీఖున కృతజ్ఞత కూటానికి అందరు బెంగుళూరు వచ్చారు.

సామ్యేలు పులివెందులకు వచ్చి అక్కడనుండి బెంగుళూరు వెళ్ళడానికి కదిరి వెళ్ళాలని చెప్పాడు. కదిరికి వచ్చేటప్పటికి రాత్రి ఎనిమిది గంటలైంది. బెంగుళూరు బస్సు రాత్రి పదకొండు గంటలకు అన్నారు. ఇంకా మూడు గంటల సమయము, ఏమి చెయ్యాలి? బస్ టికెట్టు రిజర్వ్ చేయించు కొని అలా ఊర్లోకి నడవటం ప్రారంభించాడు. దగ్గరలో ఏదైనా క్రైస్తవ చర్చి ఉన్నదా? అని అడిగితే వెళితే ఓ చర్చి కనబడింది. ముగ్గురు నడికారు ఉద్యోగస్తుల వంటివారు కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు. వారి వద్దకు వెళ్ళి హన్నాకృప పుస్తకాలు వారికిచ్చి, 'ప్రార్థన చేసుకోవడానికి ఏదైనా రూము ఉన్నదా?' అని అడిగాడు. ప్రక్కనే ఉన్న మెట్లు చూపించి ఈ మెట్ల మీద వెళ్ళండి, మేడ గది ఉన్నది అన్నారు.

కదిరి అనే పేరు విన్నాడే గానీ, అంతకుముందు ఏనాడు కదిరి రాలేదు. చీకటిలో కదిరిని చూసి పదకొండు బస్ ఎక్కి మూడున్నర గంటలకు బెంగుళూరుకు చేరాడు. తమ్ముడు విజయచంద్రకి ఫోన్ చేస్తే, చాలా సంతోషపడి – ఇప్పుడు ముఖ్యమైన విషయం ఏమిటంటే ఒంగోలు నుండి మూడవ తమ్ముడు కృపకుమార్ బెంగుళూరు వచ్చాడు. వానికి (దాసరిహళ్ళి) ఇక్కడికి ఎలా రావాలో తెలియదు. తెలుగు తప్పితే ఏమి అర్థం కాదు. బస్‌స్టాండ్‌లోనే ఎక్కడో ఉన్నాడు. వాడ్ని వెతికి పట్టుకోవాలి అని చెప్పాడు.

ఇంత పెద్ద బస్టాండ్‌లో కుమార్‌ను పట్టుకోవడం సాధ్యమా? అని మనసులో ప్రార్థన చేసుకొని బస్‌స్టాండ్‌లో రెండు వరుసలు నడువగానే కుమార్ ఎదురుగా నిలుచుని ఉన్నాడు. దేవునికి వందనాలు!

తెల్లవారు ఐదుగంటలకు బెంగుళూరు దాసరిహళ్ళి లోని చర్చికి చేరాడు. అప్పటికి హైదరాబాదు – రేపల్లె – మంగళగిరి ఒంగోలు నుండి బంధువులు వచ్చియున్నారు.

ఉదయము పదిగంటలకు చర్చి వద్ద మీటింగ్‌కి అందరు వెళ్ళారు. యూనివర్సిటికి సంబంధించినవారు అయిదుగురు వచ్చారు. నల్లని దుస్తులు సామ్యేలుకు ఇచ్చి వారు కూడా నల్లని దుస్తులు ధరించి సామ్యేలుకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. ఆరోజు, మరుసటిరోజు కూడా వేడుకలు జరిగాయి.

మే నెలలో ఒ.డి.సి. మండలం, అనంతపురం జిల్లా, కొండకమర్ల గ్రామములో యూత్‌మీటింగ్‌కి ఆహ్వా నించారు. ఒంగోలునుండి కదిరి వెళ్ళినప్పుడు కొండకమర్లలో ఓ సినిమాహాలు (అప్పటికి మూసివేసి ఉన్నది)లో ఏర్పాటు చేశారు. ఆదివారం కదిరిలోని డినామినేషనల్ టౌన్ పాస్టర్ల సమావేశము జరిగింది. సామ్యేలు అక్కడ వాక్యము చెప్పిన తర్వాత భగవాన్‌దాస్ గారింట్లో భోజనము ఏర్పాట్లుచేశారు.

భగవాన్‌దాస్‌గారు బ్యాంక్ మేనేజరుగా పనిచేస్తూనే కదిరిలో ఓ సంఘము నడిపిస్తున్నారు. కదిరి పట్టణం డినామినేషనల్ చర్చిలో కాపరుల కూడికకు ప్రెసిడెంటుగా ఉన్నారు. ఆయన భార్య హేమలత, ఒక కుమార్తె కీర్తన, ఒక కుమారుడు దేవిడ్ ప్రదీప్ బాబు. హేమలతగారు పురుషోత్తమరెడ్డి గారి భార్య తమ్ముడైన హెరాల్డ్ బెన్నిసన్ గారితో కలిసి పార్టనర్‌గా ఇంగ్లీషు మీడియం స్కూలు నడిపిస్తూ ప్రభువు సేవలో వారి రాబడిలో

ఎక్కువ భాగము ఖర్చు చేస్తున్నారు. బాగా పరిచయము పెరిగిన తర్వాత సామ్యేలు రచన 'నా కుమారి' అనే 'రూతు' కథను వారి ఖర్చుతో ముద్రించారు.

✦ ✦ ✦

సామ్యేలుకు పెన్షన్ మొదలయి రెండు సంవత్స రాలు గడిచిపోయాయి. పెన్షన్ నాలుగువందల అరవై రూపాయలు. కాని పి.ఆర్.సి. కాగితాలు వచ్చిన తర్వాతే పూర్తి పెన్షన్ వస్తుంది అని చెప్పారు.

ఓ రోజు డి.యం. అండ్ హెచ్.ఒ.గారి వద్దనుండి ఆరు సంవత్సరాల లీవు సాంక్షన్ కాగితాలు హైదరాబాద్ ఎ.జి. ఆఫీసుకు చేరిన తర్వాత అక్కడనుండి కాగితం వచ్చింది. ఆఖరి ఆరు సంవత్సరాలు లీవు సాంక్షన్ అయి నప్పటికి పెన్షన్‌కి అది వర్తించదని, సామ్యేలు పెన్షన్ నాలుగు వందల ఇరవై మాత్రమే అని చెప్పారు. చట్టప్రకారం పోవాలి కాబట్టి సామ్యేలు ఏమీ బాధపడలేదు. ఇది దేవుని చిత్తమైతే మనం ఏమి చేస్తాం? అని అనుకున్నాడు.

మరలా సంవత్సరం రోజులు గడిచిపోయాయి. ఓ రోజు ఒంగోలులో మెయిన్ బజారులో వెళ్తుంటే సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా పనిచేస్తూ సామ్యేలుకు పెన్షన్ రావడానికి సహాయపడిన 'హరిబాబు'గారు కనిపించారు. యోగక్షేమాలు అయిన తర్వాత 'పి.ఆర్.సి. కాగితాలు హైదరాబాదు వెళ్ళినవా? పెన్షన్ ఎంత వస్తుంది?' అని అడిగాడు. సామ్యేలు జరిగిన సంగతంతా చెప్పాడు. అంతా విన్న తరువాత 'నేనిక్కడ కూర్చుని ఉంటాను. నీకు ఎ.జి.నుండి వచ్చిన కాగితం తీసుకొనిరా!' అన్నాడు.

సామ్యేలు సైకిల్‌మీద ఇంటికి వచ్చి ఆ కాగితం తీసుకొని వచ్చి హరిబాబుగారికి చూపించాడు. ఆ కాగితం ఆయన చదివి – ఓ తెల్లకాగితం తీసుకొని రమ్మన్నాడు. ప్రక్కన కొట్లో ఓ కాగితం తీసుకొని వస్తే ఆయన చెబుతుంటే సామ్యేలు వ్రాశాడు. హైదరాబాదు నుండి వచ్చిన కాగితం, ఈ కాగితం నెల్లూరు సబ్ ట్రెజరీలో ఇవ్వమన్నాడు. ఆ కాగితాలు తీసుకొని సామ్యేలు నెల్లూరు సబ్‌ట్రెజరీకి వెళ్తే ఆ ఆఫీసరు ఎగాదిగా చూసి 'మీ ఫోన్ నెంబరు ఇవ్వండి, మేము మిమ్మల్ని పిలుస్తాము' అన్నాడు. సామ్యేలు ఒంగోలు వచ్చాడు. ఓ వారం తర్వాత నెల్లూరునుండి ఫోను వచ్చింది. ఆ మధ్యాహ్నం బ్యాంకులో సామ్యేలు పేరుమీద ఓ లక్షా డెబ్బయివేలు పడ్డాయి.

✦ ✦ ✦

అయిదు సంవత్సరాల క్రితం సామ్యేలు తన సొంత చర్చిలో ఉదయం ఆరాధన జరిపించిన తర్వాత సైకిలుమీద పెద్దచర్చికి అంటే జువెట్ మెమొరియల్ చర్చికి ఉదయము ఆరున్నరకు వెళ్ళి ఓ మూల మోకరించి – ప్రభువా! ఈ భూమంతా నీది కదా! ఈ విమానాలు నీవి కదా! నన్ను యెరూషలేము పట్టణం తీసుకొని పోవా? అని ప్రార్థన చేసేవాడు. అలా ఓ సంవత్సరం ప్రార్థన చేశాడు.

ఓ రోజు టి.వి.లో హెబ్రోనులో యుద్ధం జరుగటం చూపించారు. వీధుల్లో ట్యాంకర్లు తిరగడం చూశాడు. నాటి హెబ్రోను వేరు. నేటి హెబ్రోను వేరు – మన చెన్నై బొంబాయిలాగా ఉంది. సామ్యేలు మెదడులో హెబ్రోను, యెరూషలేము, బెత్లేహేము, కపెర్నహోము ఫోటోలు రెండు వేల సంవత్సరాల క్రితం లోనివి ఉన్నాయి. ఇప్పుడు ప్రభువు యెరూషలేము తీసుకెళితే తన హృదయములో ఒరిజినల్ (యేసుప్రభువు నడిచినవి) ఫోటోలు పోతాయి అని ఇక యెరూషలేము తీసుకొని వెళ్ళమనే ప్రార్థన ఆపివేశాడు.

కాని మరో ప్రార్థన పదిహేను సంవత్సరాలుగా నడుస్తోంది. అదేమంటే – మొబైల్ బైబిల్ హోమ్. ఓ బస్‌లో వెనుక సగము బుక్‌షాపు, ముందు సగము తన రూమ్ పండుకోవడానికి, వంట వండుకోవడానికి. నిండా బైబిళ్ళు, కీర్తన పుస్తకాలు, కేలండర్లు, అన్నిరకాల క్రైస్తవ వాఙ్మయముల తో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పల్లెలు, పట్టణాలు తిరిగి అమ్మాలని.

అలా ఎన్నో ప్రణాళికలు ఆ మొబైల్ బుక్ షాపు కోసం ఆలోచించాడు. రామకృష్ణ మఠము వారు నడిపే బస్సు, విశాలాంధ్ర వారు నడిపే బస్సులను పరీక్షించి ఇంకా మెరుగైన మొబైల్ బుక్ షాపు కోసం ప్రార్థించసాగాడు.

ప్రభువా! నువ్వు నాకు ఓ ఖరీదయిన కారు ఇవ్వు! ఒకప్పుడు నీకు వ్యతిరేకముగా జీవించిననాడు నాకు (1969

– 76) మూడు కారులిచ్చావు. ఇప్పుడు నీ బిడ్డను, నీ దాసుడను కనుక ఓ ఖరీదైన చిన్న కారు ఇవ్వు. ఒక్క నెల – పూర్వం నేను ఒంగోలు బజారులలో తిరిగినట్లు తిరిగి దానిని అమ్మి సెకెండ్ హ్యాండు బస్‌కొని మొబైల్ బైబిల్ హౌస్‌ని నడిపిస్తాను అని ప్రార్థించేవాడు.

అలా కొంతకాలం అంటే పదిసంవత్సరాలు ప్రార్థించి – నాయనా! ఇచ్చేదేదో నాకు కండ్లు బాగున్నప్పుడు, డ్రైవర్ లేకుండా నేనే నడుపుకొనే వయస్సులోనే ఓ కారు ఇవ్వు. ఇప్పటికే ఓ కన్ను 'కాటరాక్టు' ఆపరేషన్ అయ్యింది అని ప్రార్థించసాగాడు.

ఇప్పుడు మినిమమ్ పెన్షన్ స్కీము క్రింద డబ్బులు వచ్చినప్పుడు చిన్న మారుతి కారు కోసం వెదికాడు. యాభై వేలలో నాలుగు అయిదులు నెంబరు ఉన్న మారుతి కారు ఒంగోలులో ఉన్నది. కాని దానికి ట్రయల్ ఇవ్వరు, ఉన్న ఫలంగా తీసుకెళ్ళండి అన్నారు. అదెలా ఇంకా పదికార్లు చూశాడు. అయినా మనసు నాలుగు అయిదుల కారుమీదనే ఉన్నది. దాని ఓనరు ఓ ఆఫీసరు. ఒక్కడే నడుపుకొనేవాడు. ఆయన చనిపోయిన తర్వాత దానిని దాచిపెట్టి ఉంచారు. ఓ సాయంకాలం సామ్యేలు తెగించి డబ్బులు తీసుకొని, వారికి చెల్లించి రాత్రి ఎనిమిది గంటలకు కారు నడుపు కుంటూ ఇంటికి వచ్చాడు.

అలా ఓనాటి కారు ఓనరు, గవర్నమెంటు డ్రైవరు అయి మరలా కారు ఓనర్ అయ్యాడు. మరలా ముప్పై ఐదు సంవత్సరాల క్రితం ఎలా కారు నడుపుకుంటూ ఒంగోలులో తిరిగాడో అలాగే తిరగటం ప్రారంభించాడు.

అమెరికాలోని 'కేండీ' అనే ఆమె సామ్యేలు పెద్ద కుమారునికి ఉత్తరాలు వ్రాస్తుండేది. ఆమె అప్పుడప్పుడు సామ్యేలుకు కూడా ఉత్తరాలు వ్రాసేది. ప్రియమైన పెద్దన్నకు అని వ్రాసేది. ఆమె సొంత సాక్ష్యాలు వ్రాస్తుండేది. వాటిని హన్నాకృపలో ప్రచురించేవాడు సామ్యేలు. కారు కొనిన ఓ నెలకు అమెరికాలో 'కేండీ' చనిపోయింది.

ఓ వారం తర్వాత ఇద్దరు చర్చికొచ్చే పిల్లలు చిన్న బొచ్చుకుక్కపిల్లను తీసుకొని వచ్చి సామ్యేలుకిచ్చారు. సామ్యేలు 'ఈ కుక్క పేరేంటి?' అన్నాడు. 'కేండీ' అన్నారు. ఎంత విచిత్రం! అమెరికాలో 'కేండీ' అనే ప్రియమైన అమ్మ చనిపోతే చిన్నకుక్కపిల్లను తీసుకొచ్చి ఇచ్చిన వారు – వారికి ఈ సంగతులు ఏమీ తెలియకుండానే 'కేండీ' అని పేరు పెట్టి సామ్యేలుకు ఇచ్చారు. అప్పటినుండి ఇప్పటివరకు సామ్యేలు నోటిలో రోజుకు 'కేండీ' అనేపేరు ఎన్నిసార్లు వస్తుందో లెక్కించలేము. కేండి కారులో ముందు ప్రక్కనే కూర్చుంటుంది. సామ్యేలు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్తుంది. సామ్యేలు స్నానం చేసేటప్పుడు స్నానం చేస్తుంది. సామ్యేలు మంచం మీదనే పండుకుంటుంది.

✦ ✦ ✦

ఆఫీసుకు కంప్యూటర్ వచ్చిన తర్వాత కొంతకాలం సామ్యేలు కుమారుడు హన్నాకృప పనులు చేస్తుండేవారు. కాని ప్రతి కుమారునికి సొంత సేవ ఉండడం వల్ల పూర్తి కాలము కంప్యూటర్ పనిని చేయ్యలేకపోయారు. సామ్యేలుకు కంప్యూటర్ పనిచేసే తీరికలేదు. ఒకరిద్దరు పనివారిని పెట్టుకొనినా వారు జీతాలు తీసుకొని ఆఫీసుకు యజమాను లైనారు.

అదే సమయములో సామ్యేలు ఆఖరికుమారుడు హన్నాకృప ఎడిటర్ నతనయేలుకు తిరుపతి దగ్గరలోని వెంకటగిరిలో వివాహము నిశ్చయమైనది. సామ్యేలు తన హితుడు, స్నేహితుడు, దేవునిదూత అయిన శాంతవర్ధన్ గారిని వివాహమునకు ఆహ్వానించాడు. శాంతవర్ధన్‌గారు పదిమంది తన పరివారముతో సొంత వాహనములో వెంకటగిరికి వచ్చి చక్కని వాక్యము చెప్పారు. ఆ శాంతవర్ధన్ గారు సామ్యేలును అలా ప్రేమించారు.

దేవుడు సామ్యేలును ఎక్కువగా ప్రేమించాడు. కనుక మంచి కోడలిని ఇచ్చాడు. కోడలి పేరు 'వాణి జెస్సి' ఇంట్లో అడుగుపెట్టినప్పటి నుండి ఆఫీసుపని, ఇంటిపని క్రమంగా చేస్తున్నందువలన సామ్యేలుకు ఆఫీసుపని భారము తగ్గినది. సామ్యేలు వ్రాసిన పుస్తకాలు, ప్రతినెల హన్నాకృపను తయారుచేయడంలో సామ్యేలు కోడలే కష్టపడేది.

అంతేకాదు పెండ్లయిన పద్నాలుగు నెలలకు ఓ చక్కని మనుమరాలిని సామ్యేలుకు ఇచ్చింది. సామ్యేలు కుటుంబము, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, వారి తల్లిగారైన

హన్నమ్మగారి ఇరవై ఏడవ స్తుతికూటమునకు జనవరి 22 సాయంకాలం నాలుగు గంటలకు ఒంగోలు చర్చిలో కూడుకొనినప్పుడు వెంకటగిరిలో కోడలు ఆడపిల్లకి జన్మనిచ్చింది అని ఫోనువచ్చింది. అదే సమయంలో ఒంగోలులోని చర్చిలో విదేశస్తులు ప్రార్ధనలో ఉన్నారు. వారికి ఈ సంగతి తెలిసి 'హన్నా రెనె' అంటే హన్నా మళ్ళీ పుట్టింది అని అర్ధము వచ్చే పేరు పెట్టారు.

✢ ✢ ✢

యేసుప్రభువును నమ్ముకోవడం అంటే - అన్యుల యితే వారు ఇంతకుముందు పూజిస్తున్న దేవతలను వదిలి బాప్తీస్మము తీసుకొని సంఘములో కలిసిపోవడం. క్రైస్తవులు యేసుప్రభువును నమ్ముకోవడం అంటే ఏమిటి? యేసునందు విశ్వాసముంచడం ఆయన మీద ఆధారపడడం. ముఖ్యంగా ''ధనము'' విషయంలో డబ్బు మానవజీవితాలను శాసిస్తుంది. అందుకనే ప్రభువు మీరు దేవునికిని, సిరికిని దాసులుగా ఉండనేరరు అని చెప్పారు.

1955లో దేవునిమీద విశ్వాసముతో తన కన్న తల్లిదండ్రులు అప్పటికి పదిమంది సంతానముతో తమ ఉద్యోగాలను వదిలి విశ్వాసముతో చేసిన సేవ - అది ఎలాంటిదో ఇంటికి పెద్దకుమారునిగా ఆకలింపు చేసుకున్నాడు సామ్యేలు. జార్జిముల్లర్ వలె అనాథ శరణాలయమును ప్రారంభించి విశ్వాసముతో ఓ సంవత్సరం నడిపేటప్పుడు 1964లో దేవుడు అమెరికాలో ఓ వృద్ధురాలికి దర్శనములో కనపడి ఇండియాలో సామ్యేలుకు ధనసహాయం చెయ్యమని చెప్పాడు. 1983లో తర్వాత అమెరికాలో లిడియాముండిస్ అనే వృద్ధదంపతులు వారి వృద్ధాప్య పెన్షన్‌లోని దశమ భాగమును ఇండియాలోని సామ్యేలుకు పంపించమని స్పష్టముగా చెప్పాడు.

ఇప్పుడు 1991నుండి ఒంగోలులో నివశిస్తున్న సామ్యేలుకు సహాయపడుతున్న వారి వద్దనుండి సహాయం నిలిపివేస్తూ ఆయనే ప్రత్యక్షంగా సహాయం పంపిస్తూ వచ్చాడు. (సామ్యేలుకు తెలియనివారు - సామ్యేలు ఎన్నడు చూడనివారు ధనము పంపడం) అందువలన సామ్యేలుకు యేసయ్యతో సహవాసం ఎక్కువ అవడం మొదలయింది. విశ్వాస జీవితంలో ఎదిగే కొలది జీవితంలో ఎదురైన అనుభవాలు మనలను మరింత లోతైన విశ్వాసములోకి నడిపిస్తాయి.

హైదరాబాదు నుండి వచ్చిన వినయ్ కుమార్ రిటైర్ ఎ.సి.పి.గారు 31-7-10 తేది ఉదయం పదకొండు గంటలకు చీరాల సిపాయిపేట నుండి ఫోను చేసారు. వారిని చూడటానికి చీరాల వెళ్లామంటే చార్జీకి డబ్బులు లేవు. అలానే కూర్చుండి పోయాడు సామ్యేలు. టైం గడిచిపోతుంది. పాసింజరు ట్రైన్ 12:30 నిమిషాలకి. కుమారుని పిలిచి ఎ.టి.యమ్.కి వెళ్ళి ఎవరైనా అందులో ఆన్‌లైన్‌లో డబ్బులు వేశారేమో చూడమని చెప్పడానికి లేచాడు. కాని ఆన్‌లైన్‌లో డబ్బులు వేశామని ఎవరూ చెప్పకుండా ఎ.టి.యమ్.లో వెదకటం అవిశ్వాసమని కూర్చున్నాడు సామ్యేలు.

టైం గడిచిపోయింది. మరలా అరగంట ఆగి కుమారుని ఎ.టి.యమ్.కి వెళ్ళమని చెప్పటానికి ఆఫీసులో కుర్చీలో నుండి లేచాడు. ఫోన్ మ్రోగింది. 'హైదరాబాదు నుండి మాట్లాడుతున్నాను. హన్నాకృప ఆఫీసువారేనా?' అని అవతల స్వరము. కొంచెం పెద్ద వయసున్న సహోదరి స్వరమును విన్నాడు. 'ఔనండి! సామ్యేల్ రాజేంద్రని మాట్లాడుతున్నాను' అన్నాడు. ఆమె 'మీకు డబ్బులు పంపాలంటే చెక్కుతో పంపించాలా, లేక డి.డి చేసి పంపించాలా, ఎలా పంపాలి?' అని అడిగారు. 'అమ్మ మీరు 'హన్నాకృప' పాఠకులా?' అని అడిగాడు. 'ఔనండి!' అని చెప్పారు. 'అయితే 'హన్నాకృప' పత్రిక రెండవ పేజిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కె. సామ్యేల్ రాజేంద్ర, ఆన్‌లైన్ నెంబరు ఉంటుంది. మీరు స్టేట్ బ్యాంక్‌లో డబ్బు కడితే అయిదు నిమిషాలలో నాకు అందుతుంది' అని చెప్పి, 'మీ పేరు చెప్పండి' అని అడిగాడు. డబ్బు వేసిన తర్వాత చెబుతాను అని ఫోను పెట్టేశారు.

సెల్‌లో పడిన లాండ్‌లైన్ నెంబరు (హైదరాబాదు) నోట్ చేసుకున్న తర్వాత తన బల్ల డ్రాలో వెదికితే పదిహేను

**తరువాయిభాగం 28వ పేజీలో**

# కీ॥శే॥ వై.యస్. చిన్నకొండా రెడ్డి గారు

14

**నిత్య ప్రార్థనాపరుడు!** (వై.యస్. జోసఫ్ రెడ్డి, కనిష్టకుమారుడు, పులివెందుల గారి మాటలలో) :-

నా పేరు వై.యస్.జోసఫ్ రెడ్డి, ఆరుమంది అన్నదమ్ములలో అందరికన్నా చిన్నవాణ్ణి. నేను చదువు చాలించిన కొద్దిరోజులకే పెద్దలు నిర్ణయించిన ప్రకారం మా పెద్దక్కగారి కుమార్తెను వివాహమాడాను. తర్వాత మాకు ఇద్దరు కుమార్తెలు మీన, వీణ జన్మించారు. పెద్దమ్మాయికి పెండ్లి చేశాను. వారు అమెరికాలో ఉన్నారు. చిన్నమ్మాయి హైదరాబాద్‌లో చదువుకుంటున్నది. మా పెళ్ళి అయిన కొద్దిరోజులకే అన్నదమ్ములందరము వేరుగా ఉంటున్నాము. అందరికంటే చిన్నవాణ్ణి అని అమ్మ, నాన్న ఇరువురు నావద్దనే ఉంటారు. నాన్నగారి సంరక్షణలోనే వుంటూ, పుట్టింది మొదలుకొని వారిని విడిచి ఉండలేదు. వారు కూడా చిన్నవాణ్ణి అని నన్ను ప్రేమతో చూచుకొనేవారు. ఏదైనా సలహా ఇచ్చినా కూడా దాన్ని గౌరవించేవారు.

నాన్నగారు నిత్యం ప్రార్థనా జీవితం గడిపేవారు. ఆయన నిత్యం ప్రార్థనలో ఉన్నా అప్పుడప్పుడు ఆయన పడే శ్రమలు, కష్టాలు చూచి కొన్ని పర్యాయములు నాన్న గారితో ఇదే విషయం అడిగాను. 'నిత్యం ప్రార్థనలు చేస్తుంటారు, మనకెందుకు కష్టాలు వస్తాయి?' అని. ఆయన ఇచ్చిన సమాధానం ఒక్కటే "అన్ని మనకు అనుకూలంగా ఉండవు, దేవుని సృష్టిలో సుఖము, కష్టము రెండు ఉంటాయి. కొంతమందికి కొన్ని ఎక్కువగాను, కొంతమందికి కొన్ని తక్కువగాను ఉంటాయి. అందువల్ల దేవున్ని మనము ప్రశ్నించగలమా?" అని అనేవారు. ఇప్పుడు ఆయన మరణించి దాదాపు పదిహేడు సంవత్సరాలు అయినా అమ్మ నాతోనే ఉంది. అందువల్ల ఆయనకూడా మా వద్దే ఉన్నారన్న అనుభూతితో జీవిస్తున్నాము. అందరిని గౌరవించమనేవారు. ఏ రోజుపని ఆ రోజే చేయాలని చెప్పేవారు. ఎవరికైనా సమయం ఇస్తే ఆ సమయం తప్పక పాటించేవారు. క్రమం తప్పక గుడికి వెళ్ళడం, కుటుంబ ప్రార్థన చేయడం తప్పక పాటించేవారు. సాయంత్రం ఆర్.ఆర్.కె. మూర్తిగారి రేడియో ప్రసంగం వినడం తప్పనిసరిగా చేసేవారు.

**మాభక్తికిమూలం** (వై.యస్.భారతి, వై.యస్.జగన్మోహన్ రెడ్డి గారి భార్య, పులివెందుల గారి మాటలలో):-

నాకు పేరు పెట్టింది కొండారెడ్డి తాతగారు. నేను మరీ చిన్నగా ఉన్నప్పుడు (తాత వాళ్ళు ఉమ్మడి కుటుంబంగా ఉన్నప్పుడు) అందరం కలిసి తాతతో కుటుంబ ప్రార్థన ప్రతి రాత్రి చెయ్యడం గుర్తు. చిన్నప్పుడు నాకు బైబిల్ చదవటం ఆయనే మొదలుపెట్టించారు. కీర్తనలు, సామెతలు చదవమని చెప్పారు. నేను హాస్టల్‌లో ఉన్నప్పుడు నాకు దేవుని గురించి ఉత్తరాలు వ్రాసేవారు. నేను కూడా నాకు దొరికిన దేవుని పుస్తక ప్రతులను ఆయనకు పంపేదాన్ని. అది ఆయనకు సంతోషం ఇచ్చేది అనుకుంటా! ఆయన పిల్లలు, పిల్లల పిల్లలు దేవునికి దగ్గరగా జీవించాలని ఆయనకు ఎంతో ఇష్టంగా ఉండేది. ఆయన ఉన్నంతవరకు చర్చ్‌కి మేము ఆయనతో వెళ్ళేవాళ్ళము. పిల్లలందరిని ఆయన కారులో ఎక్కించుకుని చర్చ్‌కి తీసుకొనివెళ్ళేవారు.

నన్ను, మా తమ్ముడిని బెంగుళూరులో హాస్టల్‌లో చేర్పించడానికి స్కూల్ ఎంట్రన్స్‌పరీక్షకు ఆయనే తీసుకెళ్ళారు. అప్పుడు మాకు చాలా పుస్తకాలు కొనిచ్చారు. తాతగారు చాలా క్రమశిక్షణగా ఉండేవారు. ఏ పని అయినా టైం ప్రకారం చెయ్యడం ఆయనకు అలవాటు. ఎంత క్రమంగా అంటే ఆయనను చూసి మనము టైం సెట్ చేసుకోవచ్చు. ఏదైనా మితంగా ఉండేవారు. ఏదైనా ఇష్టం అని ఒక్క మెతుకు కూడా ఎక్కువ తినరు. చాలా మితంగా మాటలాడే వారు కూడా! చాలా నియంత్రణగా ఉండేవారు.

తనకంటే గొప్పవారితోనైనా తనకంటే తక్కువ వారితోనైనా తన తోటివారైనా ఒకేలాగా ఉండేవారు. దేవుని కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించేవారు. రేడియోలో దేవునివాక్యం వినడంగాని, తెల్లవారుజామున బైబిల్ చదువుటలోనూ, ప్రార్థన చెయ్యడంలోను ఎప్పుడూ తప్పే వారు కారు. నిరాడంబరత అంటే ఆయనకు చాలా ఇష్టం. నాతో ఒకసారి చెప్పారు - కాటన్ దుస్తులు వేసుకుంటే బాగుంటుందని. గొప్ప గొప్ప పనులు చెయ్యాలి అని చెప్పలేదు కాని గొప్పగా ఉపయోగపడాలని చెప్పారు. నా

పదవ తరగతి పరీక్షలు అయిపోయిన తర్వాత టీచర్ అయితే ఎంతోమంది పిల్లలను మంచి మార్గంలో నడుపవచ్చు అని చెప్పారు.

కేన్సర్‌తో అనారోగ్య పాలైనంత వరకు కాం[ట్రాక్ట్ పనులు, తోటపనులు, కట్టుబడి పనులు చూసుకునేవారు. ఖాళీగా కూర్చుని ఉండడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. అదే సమయంలో పనే జీవితంగా కూడా ఉండేవారు కాదు. మా మామగారు డా. వై.యస్. రాజశేఖర్ రెడ్డి గారు మొదటి ఎలక్షన్ల సందర్భంలో తాతగారి (ఆయనకు పెదనాన్న) దగ్గరకు వెళ్ళినప్పుడు ధైర్యము కలిగి నిబ్బరంగా ఉండాలని చెప్పి యెహోషువ మొదటి అధ్యాయము చదివి ప్రార్థన చేసి పంపినారని మా మామగారు మాకు రెండు మూడు పర్యాయాలు చెప్పారు. ఇన్ని గొప్ప లక్షణాలు కలిగిన కొండారెడ్డి గారి మనవరాలిగా ఉన్నందుకు, ఆయనలోని కొన్ని సుగుణాలైనా దేవుడు నాకు అనుగ్రహించాలని కోరుకుంటున్నాను.

ఫలించే కొమ్మనే కత్తిరిస్తారు
ఆ కొమ్మే మరిన్ని ఫలాలనిస్తుంది
నీ ఆనంద జీవితం కూలిపోయిందా
నీ ఆశలు అడియాసలైనాయా
నీ కలలు, కోరికలు, ఆశయాలు నశించి
అణగారిపోతే ఆనందించు – ఇది దేవుని పనే
ఆయన చేతుల్లో కత్తెర వున్నది
కొంత ఫలించిన నీ జీవితం మరింత
ఫలభరితమవుతుంది.

**స్థితప్రజ్ఞుడు** (మాధవి పాల్‌రెడ్డి, వై.యస్.ప్రకాశ్‌రెడ్డి గారి చిన్నకోడలు, యువ్.యస్.ఎ. గారి మాటలలో) :–

ఎవరూ పరిపూర్ణులు కారు. కొండారెడ్డి తాత లాంటి వారు మాత్రమే దేవుని ఆసరాతో పరిపూర్ణతకు ప్రయత్నించి సాధిస్తారు. అనుభవం లేని నేను కొంతకాలం ఆయన సమయపాలన, నిజాయితీ, క్రమశిక్షణ చాధస్తంగా అనుకొని చిన్నగా నవ్వుకోవడం గుర్తు. ఓ సమస్య పరిష్కారం లో రెండుగంటలు తాతతో మాట్లాడడం ఆయన స్థితప్రజ్ఞతను తెలియజేసింది. ఆ గురుత్వమే నా బిడ్డకు ఆయన పేరు పెట్టుకోవడానికి కారణమైంది.

నమ్మికలో నిలకడగా ఉండు
సహనపరుడే జయిస్తాడు
క్రీస్తును ధరించినవాడు
నింగి నేలా పడిపోయినా నిలిచే ఉంటాడు
ఆవేదన ఎంతోకాలం ఉండదు
మట్టి కలిసిన ఆశ మళ్ళీ పల్లవిస్తుంది
తుఫాను నిమ్మళించాకే అరుణోదయం
సిలువ పథము పరలోకానికి బాట
రాజ్యం తండ్రిదే నమ్మండి
హృదయమా, స్థిరంగా ఉండు.
నీవు నిశ్చలంగా ఉంటే
నీ అంతరంగంలో శాంతి నిండుతుంది

**నా తొలిగురువు** (మంజుల సర్వోత్తమ్, వై.యస్.ప్రకాశ్‌రెడ్డి గారి కుమార్తె, బెంగుళూరు గారి మాటలలో) :–

మా తాతగారైన శ్రీ వై.యస్.చిన్నకొండారెడ్డి గారి వద్ద పెరగటం వలన ఆయన జీవనశైలిని గమనిస్తూ నేను నేర్చుకున్న పాఠాలు అనేకం. బి.యస్.సి. డిగ్రీ పూర్తి అయిన తరువాత యం.యస్. చేస్తానని తాతగారితో ప్రస్తావించి నపుడు బి.ఇడి. చేసి టీచర్‌గా పదిమందికి చదువు చెప్పు అని సలహాయిచ్చారు. అప్పట్లో టీచర్‌గా వెళ్ళడం ఏంటని నిరాకరించినప్పటికి పి.జి.కి వెళ్ళిన తర్వాత బి.ఇడి.చేసి ఒక స్కూలును నడిపి, వందలమంది విద్యార్థిని విద్యార్థులకు బోధించి ఆయన కోర్కెను నెరవేర్చగలిగాను.

నాలోని సామర్థ్యాన్ని గమనించి అబ్బ (తాతగారు) అలా సలహా ఇచ్చారేమో! అందుకే అంటారు 'పెద్దలమాట పెన్నిధి మూట' అని. బైబిల్ పాఠాలలో ఎన్నో సూక్తులతో జీవితం గురించి వివరించడమే కాకుండా మాకందరికి ఒక మాదిరిగా నిలచిన గొప్ప వ్యక్తి. ఆయన నేర్పిన సూక్తులు నా జీవితానికి మార్గదర్శకాలు. క్రమశిక్షణలో మనకు అప్పగించిన పని ఎంత కష్టమైనా భక్తి శ్రద్ధలతో ఇష్టంగా చేయడం, ఇతరులకు చేతనైన సహాయం చేయడం, వినయ విధేయతలు కలిగి ఉండడం, కష్టంలోను, సుఖంలోను ప్రభువుని తలచుకోవడం లాంటి జీవితపాఠాలు నేర్పిన నా తొలిగురువుకు నా జోహార్లు. ఆయనకు మనవరాలినైనందుకు గర్విస్తున్నాను.

# ప్రయాణంలో ఓ మజిలీ

ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ రచయితలకు కార్య కేంద్ర స్థానము అయిన డాక్టరు నూకతోటి జయకుమార్‌గారి ఆధ్వర్యములో 2010 అక్టోబర్‌లో జరిగిన క్రైస్తవ కవి సమ్మేళనమునకు హాజరైన తరువాత హన్నాకృప మాస పత్రికకు పరిచయాలు పెరిగినవి.

మరలా మే నెలలో రాయగడ ఒరిస్సాలో దేవదానంగారి కుటుంబము వద్దనుండి ఒంగోలు ప్రయాణం చేస్తుంటే పాస్టరు జయకుమార్‌గారు విశాఖపట్నంలో ఒంటి గంట సమయమున బస్‌నుండి క్రిందకి దించి సాయంకాలం ఎనిమిది గంటల వరకు బైబిలు విషయాల లోతుల్లోకి వెళ్ళి రాత్రి ప్రయాణానికి ఒంగోలుకు బస్ టిక్కెట్టు తెప్పించి వీడ్కోలు పలికారు.

ఇక్కడ ప్రభువు కృప ఏమిటంటే ఆరుగంటల సేపు అరనిమిషమైనా అంతరాయం కలుగలేదు. మామూలుగా అయితే జయకుమార్‌రావు గారికి అరనిమిషమైనా విశ్రాంతి దొరకదు.

✣ ✣ ✣

ఓ నలభై రోజుల క్రితం ఓ మంగళవారం మధ్యాహ్నం 12:40 నిమిషాలకు రేడియోలో ఆన్ చేస్తే ఓ కమ్మని కంఠస్వరముతో డాక్టర్ ఝాన్సీ కె.వి.కుమారిగారు హైదరాబాదు వాసి శ్రీ వి.జె.పట్నాయక్ గారితో పరిచయము వినవచ్చింది. ఆ పరిచయ కార్యక్రమము నా ఆఫీసులో జరుగుతున్నంత శ్రావ్యంగా ఉన్నది. ప్రోగ్రామ్ అయిన తర్వాత నా ఆఫీసులో ఉన్న నా కుమారుడు (ఎడిటర్) నతనయేలును అడిగాను – ఝాన్సీగారికి ఫోన్ చెయ్యాలంటే ఏమి చెయ్యాలి? అని.

ఝాన్సీగారు డా॥ నూకతోటి జయకుమార్ రావు గారి కవి సమ్మేళనానికి వచ్చారు అన్నాడు. వెంటనే విజయ వాడ స్వర్ణదీపిక శివాజీ రావుగారికి ఫోన్ చేస్తే వారు అడ్రసు, ఫోన్ నెంబరు ఇచ్చారు. అప్పుడు ఝాన్సీ గారితో మాట్లాడిన తర్వాత నెమ్మది పొందాను.

తర్వాత మరలా ఓ మంగళవారం మరొక పరిచయము కార్యక్రమములో కూడా నేను చాలా కదిలింప బడినాను. ఝాన్సీగారు పరిచయము కార్యక్రమములో వేసే ప్రశ్నలు గుండె అడుగున ఉన్న భావాలను కూడా బయటకు తీసుకొని వచ్చే విధంగా ఉన్నాయి. ఆ సందర్భములో అలా పరిచయమైన ఝాన్సీగారిని 20-10-11న హైద్రాబాద్ ఆకాశవాణిలో వారి ఆఫీసులో దైవజనుడు యెడవల్లి ప్రసాద్‌రావు, నిమ్మగడ్డ సుధీర్ గార్లతో కలిసి కలుసుకున్నాను. ఓ గంట వారి మాటలు వింటూ ప్రభువు మాకిచ్చిన ఈ అనుభవమునకు ఆయనకు స్తోత్రము చెల్లించాము.

✣ ✣ ✣

కదిరి పట్టణంలో గాడ్స్ సర్వెంట్ అండ్ ఇవాంజి లిస్టిక్స్ ప్రేయర్ ఫెలోషిప్, నాల్గవ కుటుంబ సదస్సు 5,6,7 తారీఖులలో షారోన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జరిగినవి. రెవ.ఆనందకుమార్ యడిక, లిల్లా ఆనందకుమార్ వై.యస్., ఇవాంజిలిస్టు సాలమన్ విశాఖపట్టణం వర్తమానం అందించే తరుణములో ఆహ్వానము పంపించాడు. కాని అక్టోబరు 9న వై.యస్. పురుషోత్తమ రెడ్డిగారి భార్య డా॥ఫ్లావియాగారి జ్ఞాపకార్ధ కూడిక సందర్భమున పులివెందులలో హాజరవ వలసి యున్నందున 8 శనివారం రాత్రి పులివెందులకు బస్ సీటు రిజర్వేషన్ చేయించుకొన్నాను. ఆ బస్ ఒంగోలులో బయలుదేరే సమయము రాత్రి తొమ్మిది గంటలకు బస్ స్టాండులో వేచివున్నాను. తొమ్మిది గంటలకు కడప బస్ వచ్చింది. అందులో ఎక్కి సీటు రిజర్వేషన్ నెం.5 కండక్టరుకు చెప్పి కూర్చున్నాను. 9:15గంటలకు బస్ బయలుదేరింది. కండక్టరు 'సార్! బస్ సూపర్ లగ్జరీ' అన్నాడు. 'ఇది డీలక్స్ బస్ కదా!' అంటే ఆయన టిక్కెటు కొడుతూ నాకు జవాబు చెప్పలేదు. బండి టంగుటూరు వరకు చేరిన తర్వాత కండక్టరు నా టిక్కెట్టు చూసి 'మీరు ఎక్కవలసిన బస్సు ఇదికాదు' అన్నాడు. నేనేమి మాట్లాడాలి? సీటునెంబరు ఐదులో కూర్చున్నాను. రిజర్వేషన్ అని చెప్పాను. 'మరి ఇప్పుడేమి చెయ్యాలి?' అన్నాను. 'ఇక్కడ దిగి ఒంగోలు వెళ్ళండి' అన్నాడు. 'కాని నేను అక్కడికి వెళ్ళేటప్పటికి ఆ బస్ వెళ్ళిపోవచ్చును కనుక కావలి వరకు వస్తాను. అక్కడ ఆ బస్సు ఎక్కుతాను' అన్నాడు. 'అలాగైతే టిక్కెట్టు

తీసుకోవాలి' అని యాభై రూపాయల టిక్కెట్టు ఇచ్చాడు. నేనే కండక్టరుతో కొంచెం గట్టిగా మాట్లాడి ఉన్నట్లయితే ఈ చిక్కు ఉండేది కాదు అనుకొని కావలిలో దిగి, తర్వాత రిజర్వేషన్ ఉన్న బస్‌లో కడప చేరాను.

హైద్రాబాద్ నుండి దైవజనులు, పే అండ్ అకౌంట్సు ఆఫీసర్ ప్రసాద్‌రావు గారు అదే సమయానికి హైద్రాబాదు నుండి వచ్చారు. ఇద్దరం కలిసి తెలుగు గంగ గెస్ట్‌హౌస్‌కి వెళ్ళి సిద్ధపడిన తర్వాత ఆయన వచ్చిన కారులో సెయింట్ మేరి చర్చివద్ద కమలాపురం గురుకుల జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ శారా మార్గరేట్ గారితో మాట్లాడి, పులివెందులలో సామ్యేల్ జాన్‌గారిని కలుసుకొని కదిరి వెళ్ళాము. అక్కడ భగవాన్ దాస్‌గారు నడిపిస్తున్న చర్చిలో శ్రీ యడవల్లి ప్రసాద్ రావు గారు వాక్యోపదేశము చేసి, రెండుగంటలకు భోజనము చేసి పులివెందులకు నాలుగు గంటలకు వచ్చాము. ప్రార్థన కూడిక ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు జరిగినది.

పురుషోత్తమ రెడ్డిగారి ఆఖరి చెల్లెలు యస్. కమలమ్మగారింట్లో భోజనము చేసి కారులో కడప వచ్చాము. ప్రసాద్‌రావు గారు కారులో హైద్రాబాద్ వెళ్ళవలసి ఉన్నది. కనుక నన్ను కడప బస్ స్టాండ్‌లో వదిలారు.

ఒంగోలు బస్ పూర్తిగా నిండిపోయింది. నిలబడి వస్తానంటే కండక్టరు ఒప్పుకోలేదు. అయినా బస్‌స్టాండ్ ముందు మూడు బస్‌లు ఆగి ఉన్నాయి. అవన్ని విజయవాడ స్పెషల్ అన్నారు.

కాని అవికూడా రిజర్వేషన్ పూర్తి అయిపోయాయి. ఒక బస్ ఎక్కాను. ఒకటవ నెంబరు సీటులో ఓ యవ్వనస్తురాలు కూర్చుని ఉంది. రెండవ నెంబరు ఖాళీగా ఉన్నది. బస్ అంతా నిండిపోయింది. నేను రెండవ నెంబరు సీటులో కూర్చుంటానని కండెక్టరును అడిగాను. ఆ లేడీ ఒప్పుకుంటే కూర్చోండి అన్నాడు. వెంటనే కూర్చున్నాను. ప్రభువు నా కొరకు సీటు దాచివుంచాడని అప్పుడు తెలుసుకున్నాను. రాత్రి మూడు గంటలకు ఒంగోలులో దిగాను.

✦ ✦ ✦

అక్టోబరు 19వ తారీఖు చెన్నై హైద్రాబాద్ ట్రైన్‌లో బెర్తు రిజర్వేషన్ కొరకు 11వ తారీఖు సాయంకాలం ఐదు గంటలకు ఒంగోలు స్టేషన్‌కు నడుస్తున్నాను. అంతలో తెలిసిన వ్యక్తి టూ వీలర్ మీద వచ్చి నన్ను ఎక్కించుకుని రిజర్వేషన్ కౌంటరు వద్ద దించాడు.

హైద్రాబాద్ 19 రాత్రి చెన్నై బండికి ఇవ్వండి అన్నాను. ముగిసిపోయాయి అని కౌంటర్‌లోని అమ్మాయి చెప్పింది. నేను వెనుకకు తిరుగుతుంటే ఆగండి! చూస్తాను అని కంప్యూటర్‌లో చూసి, ఒకే బెర్తు ఖాళీగా వుంది అని టిక్కెట్టు ఇచ్చింది. ఆ మోటర్ సైకిల్ మీద నన్ను స్టేషన్‌కు తీసుకొని రాకపోతే రిజర్వేషన్ దొరికేదికాదు.

రాత్రి 10 గంటలకు స్టేషన్‌లో ట్రైన్ వచ్చింది. యస్. 11లో అరవై ఎనిమిదవ బెర్తులో కూర్చున్నాను. బండి బయలుదేరింది. ప్రక్కవాటాలో 65,66 నెంబరులో ఉన్న ఇద్దరు స్త్రీలు నిలుచుని ఉన్నారు. 'ఏమమ్మా! ఎందుకు నిలుచున్నారు?' అన్నాను. 'మా చెల్లెలు యస్. 2లో ఉన్నది. అక్కడ ఆమె ఒక్కతే 'లేడీ'. అందువలన ఆమె మొబైల్‌లో ఆ సంగతి చెప్పి బాధపడుతోంది' అన్నారు.

11వనెంబరు బోగినుండి లగేజి మోసుకుంటూ తొమ్మిది బోగీలు దాటాలంటే చాలాకష్టం. అప్పటికే సమయం 10:30 గంటలు. ప్రాణం ఒప్పుకోలేదు. ఇప్పుడేమి చెయ్యాలి. నాకు రిజర్వేషన్ దొరకకపోతే జనరల్ బోగీలో ప్రయాణం చేసేవాడిని. అది ఇంకా కష్టం కదా! ఒకవేళ ఈ స్త్రీలకు సహాయము చెయ్యడానికే దేవుడు నాకు ఈ బెర్తు ఇప్పించాడేమో! ఒకవేళ నేనిప్పుడు వారికి సహాయ పడకపోతే జీవితాంతం గుర్తున్నంతవరకు వారికి సహాయ పడలేక పోయాను అనే గిల్టీ మనసులో ఉంటుంది. చాలా కష్టపడి వారికి సహాయపడితే తృప్తి మిగులుతుంది అనుకొని లగేజి తగిలించుకుని కుడిచేతిలో సూట్‌కేస్ పట్టుకొని రెండవ నెంబరు బోగీకి చేరి, ఆమెతో మీరు పదకొండవ నెంబరుకు వెళ్ళండి అని చెప్పాను. ఆమె కండ్లలో కృతజ్ఞత ఇప్పుడు పడిన కష్టాన్ని మరిచిపోయేలా చేసింది.

తెల్లవారు ఆరు గంటలకు నిమ్మగడ్డ సుధీర్ (సాఫ్ట్‌వేర్ ఇంజనీర్) సికింద్రాబాద్ స్టేషన్‌కి వచ్చాడు. మేము స్టేషన్ నుంచి బయటకు వచ్చేటప్పుడు పద్మారావు నగర్ స్టేట్ బ్యాంకు మేనేజరుగారైన సువర్ణరాజుగారు వారి కారులో మమ్మల్ని ఆర్.టి.సి. క్రాస్ రోడ్డులోవున్న వారింటికి తీసుకువెళ్ళి, అల్పాహారమైన తర్వాత వారి కారులోనే

**తరువాయి భాగం 6వ పేజీలో**

5

# చేజారిన అవకాశం

– లియోటాల్‌స్టాయ్

ఒక ఊరిలో ఇవాన్ నివశిస్తున్నాడు. ధనవంతుడైనా కష్టజీవి. ముగ్గురు కుమారులు ఉన్నారు. అతని భార్య ఇవానోవా. చాలా తెలివైనది. మంచిది. ఇవాన్ తండ్రి ఏడు సంవత్సరాలుగా ఉబ్బసముతో బాధపడుతున్నాడు. పని చేయకుండా ఉండేవాడు. కాని ఇంటిల్లిపాది కష్టంచేసి బ్రతికే వారు. జీవితం ఏ ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుంది.

ప్రక్కింటిలో "గోర్గే" అనే వారి కుటుంబము నివశిస్తున్నది. వారు, వీరు కూడా చాలా అన్యోన్యంగా జీవిస్తూ ఒకరి అవసరాలు మరొకరు తీర్చుకుంటూ ఉండేవారు. ఈ ఇంటిలో కూడా ఓ పెద్దాయన ఉన్నాడు. ఏదయినా చిన్న చిక్కులు వచ్చినప్పుడు ఈ పెద్ద వయస్సున్నవారు సరిచేసుకొని పోయేవారు.

కొన్ని సంవత్సరాలైన తర్వాత రెండిండ్లల్లోను యవ్వనస్తులు వ్యవసాయం ప్రారంభించారు. ఇవాన్ ఇంటిలో ఓ కోడి గుడ్లు పెట్టడం ప్రారంభించింది. అది రోజు పశువుల పాకలో గాదె క్రింద గుడ్డు పెట్టేది. ఇవాన్ కోడలు సాయం కాలం వెళ్ళి ఇంట్లోకి తెచ్చి దాచిపెట్టేది.

ఒకరోజు ఆ కోడిని పిల్లలు బెదిరించారు. అది రెండు ఇండ్ల మధ్యలో కంచె దాటి "గోర్గే" దొడ్లోకి వెళ్ళింది. ఇవాన్ కోడలు సాయంకాలం గుడ్డుకోసం వెళితే గుడ్డులేదు. ఇంట్లోకి వచ్చి అందరిని 'గుడ్డు తీశారా?' అని అడిగింది. అందరు 'మాకు తెలియదు' అన్నారు. కానీ ఇవాన్ ఆఖరి తమ్ముడు ఇంట్లోకి వస్తూ 'నీ కోడి ప్రక్కింట్లో దొడ్లోకి వెళ్ళడం నేను చూశాను' అన్నాడు.

ఆ అమ్మాయి ప్రక్కింటికి వెళ్ళి 'మాకోడి మీ ఇంట్లో గ్రుడ్డు పెట్టింది చూశారా?' అని అడిగింది.

ఆ ఇంట్లో ఉన్న ముసలామె 'మా ఇంటికి మీ కోడి రాలేదమ్మా! మా కోళ్ళు పెట్టే గుడ్లే మాకు ఎక్కువైనాయి. ఇరుగుపొరుగు వాళ్ళ కోడిగుడ్లు మాకెందుకు?' అన్నది.

ఈ విధమైన మాటలు ఇవాన్ కోడలికి కోపం తెప్పించాయి. ఆ ముసలామె మాటలకి ఇంకా నాలుగు కలిపి ఇంకా కోపంగా వడ్డించింది.

కొంచెంసేపటికి 'గోర్గే' ఇంటివారు ఇవాన్ ఇంటి వారు ఒక్కొక్కరు కలిసి గోలగోలగా అరుచుకోవడం ప్రారంభించారు. ఇంతవరకు వారి స్నేహము, ప్రేమ అందరు మరచిపోయి ఒకరిని మించిన కోపంతో ఒకరు అరుచుకోవడం ప్రారంభించారు. కొంచెంసేపటికి బూతులు తిట్టుకోవడం ప్రారంభించారు.

తర్వాత మరి కొంచెం సేపట్లోకే మాటలు ఆగిపోయి చేతులతో కొట్టుకోవడం ప్రారంభించారు. ఇవాన్ చొక్కాని గోర్గే పట్టుకొంటే, గోర్గే గడ్డం సగం ఇవాన్ వలన పోయింది. ఇంతలో బయట జనం మూగి వారిని విడిపించారు.

గోర్గే ఆ గడ్డం మూటగట్టి పట్టణ న్యాయాధిపతి వద్దకు వెళ్ళాడు. ఇవాన్ యొక్క ముసలి తండ్రి ఇంటివారి నందరిని పిలిచి ఈ విధమైన తగాదాలు మాని సమాధానంగా జీవించమన్నాడు. కాని అతనిని ఎవరు పట్టించుకోలేదు. ఇవాన్ కోడలు 'వాళ్ళు మనల్ని చెడ్డ మనుష్యులు అని తిట్టారు' అన్నది. 'వాళ్ళు అలా పిలిచినా మనం చెడ్డకు మంచి చెయ్యాలి. ఇప్పుడు మీరు వారితో సమాధానపడితే మంచిది. లేకుంటే ముందుముందు ఎక్కువ కష్టాలు పడవలసివస్తుంది' అన్నాడు. 'గోర్గే నా చొక్కా చించాడు. కాని వాని కుమారుడు నా ప్యాంటు కూడా చించాడు. వానికి బుద్ధి చెబుతాను' అని చినిగిన చొక్కా తీసుకొని గ్రామ న్యాయాధిపతి వద్దకు వెళ్ళి గోర్గే మీద ఫిర్యాదు చేశాడు ఇవాన్. కాని అతను ఆశించినట్లు జరుగలేదు. కనుక కోర్టులో కేసు పెట్టాడు. ఆడవాళ్ళు కాక రెండు కుటుంబాలలోని చిన్న పిల్లలు కూడా చీటికి మాటికి గొడవపడేవారు.

నెలకు ఒక్కసారైనా ఏదో ఒక తగాదాతో కోర్టుకు వెళ్ళేవారు. ఒకసారి – ఇవాన్ డబ్బు చెల్లించటమో లేక నాలుగు రోజులు జైలులో గడపడమో, అదేవిధంగా గోర్గేకూడా డబ్బు చెల్లించడమో జైలులో నాలుగు రోజులు గడపడమో జరిగేది. అలా జరిగినప్పుడెల్లా వారు మరెక్కువగా తగువులాడుకొనేవారు.

ఈవిధంగా ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇవాన్ ముసలి తండ్రి అనేకసార్లు 'నాయనలారా! ఈ

తగాదాలు మానుకొని పొలం పని చూసుకోండి. ఈ విధమైన జీవితంలో నెమ్మది ఉండదు' అని చెబుతుండేవాడు. అయినా ఎవరూ ఆయన మాటలు పట్టించుకోలేదు.

ఇవాన్ కోడలు ఓ పెండ్లి విందులో గోర్డే తమ గుట్టం దొంగిలించాడని అన్నది. అప్పటికే త్రాగి ఉన్న గోర్డే ఆమెను బలంగా కొట్టాడు. ఆమె వారం రోజులు మంచంలో ఉన్నది. ఈ విషయంలో ఇవాన్ సంతోషించాడు. ఎలాగైనా గోర్డేని సైబేరియా జైలులో పెట్టించాలని జిల్లా కోర్టులో కేసు నమోదు చేసి, క్రింది అధికారులకు లంచాలు ఇవ్వడానికి చాలా డబ్బు ఖర్చుచేశాడు. ఫలితంగా గోర్డేకు ఇరవై బెత్తపు దెబ్బలు, పదిమందిలో కొట్టాలని తీర్పు వచ్చింది.

బెత్తపు దెబ్బలు తిన్న గోర్డే బజారులో ఇవాన్‌ని కలిసి 'నా వీపు దెబ్బలతో మండిపోయింది. ఫరవాలేదు నీ క్కూడా ఇంతకంటే ఎక్కువ మంట కలుగుతుంది' అని చెప్పి వెళ్ళిపోయాడు.

వెంటనే ఇవాన్ కోర్టుకు వెళ్ళి 'గోర్డే నా ఇల్లు తగులబెడతానని బెదిరించాడు' అని చెప్పాడు.

వెంటనే గోర్డేను పిలిపించి 'నీవు ఇవాన్ ఇల్లు తగులబెడతానని అన్నావటగా?' అని అడిగారు.

'నేను అలా అనలేదు. నీవు నాకు ఎన్ని బెత్తం దెబ్బలన్నా ఇప్పించగలవు, నీకు ఆ శక్తి ఉన్నది. నిజం కొరకు న్యాయం కొరకు నేనొక్కడినే ఇన్ని దెబ్బలు తినాలా?' అన్నాను. అని ఇంకా ఏమో చెప్పబోయాడు కాని అతని పెదాలు వణకడం ప్రారంభమయ్యాయి. నోట మాట లేకుండా నేలను చూస్తూ వణికిపోసాగాడు. అతని స్థితిని గమనించిన న్యాయమూర్తులు కూడా అతని చూసి జాలిపడ్డారు. వారిలో వృద్ధుడైన న్యాయాధిపతి 'చూడండి సోదరులారా! మీరిద్దరు ఈ విధంగా సంవత్సరాల తరబడి తగువులాడుకోవడం ఏమి బాగోలేదు. బలహీనురాలైన స్త్రీని గోర్డే కొట్టడం తప్పే! దేవుని కృపవలన ఆ అమ్మాయి చనిపోలేదు. ఒకవేళ ఆమె చనిపోయి ఉంటే ఏమయి ఉండేది? కనుక మీరిద్దరు సమాధానపడాలి' అన్నాడు.

కాని కోర్టు సెక్రెటరి 'అదేమి కుదరదు. ఆర్టికల్ 117 ప్రకారం తీర్పు ఇవ్వవలసిందే' అన్నాడు.

అందుకు జడ్జి 'నువ్వు అధికముగా మాట్లాడు తున్నావు. మొదట దేవుని చట్టం – అదే నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు అనేది నెరవేరాలి' అన్నాడు. అయితే గోర్డే ఈ మాటలు పట్టించుకోలేదు. 'నాకు ఇప్పుడు యాభై సంవత్సరాల వయస్సు. ఈ విధంగా దెబ్బలకు నా వీపు ఎన్నడు ఇవ్వలేదు. ఇప్పుడు ఇవాన్ వలన నేను ఈ స్థితికి వచ్చాను. అది నేను గుర్తు ఉంచుకుంటాను' అని వణుకుతున్న కంఠముతో నేలవైపు చూడసాగాడు.

ఇవాన్ ఇంటికి వెళ్ళాడు. ఇంట్లో ఎవరూ లేరు. పొలం నుండి ఇంకా రాలేదు. ఒక్కడే చెక్క కుర్చీలో కూర్చున్నాడు. అతను ఆలోచించసాగాడు. జరిగిన సంగతులు అతనికి ఎదురుగా నిలిచాయి. మొట్టమొదట బెత్తం దెబ్బల తీర్పు వచ్చినప్పుడు గోర్డే ఎలా వణికిపోయాడో, నిశ్శబ్దంగా గోడను చూస్తు ఎలా వున్నాడో ఆలోచించాడు. ఒకవేళ ఆ శిక్ష తనకే పడితే తాను ఏమి చేసి ఉండేవాడు? ఇంతలో అతని తండ్రి గదిలోకి వచ్చాడు. ఆయన దగ్గుతూ 'గోర్డేకు శిక్ష పడిందా?' అన్నాడు. 'ఔను ఇరవై బెత్తం దెబ్బలు అన్నాడు' ఇవాన్. ఆ పెద్దాయన విచారంగా 'ఇదేమి బాగోలేదు. గోర్డేకి దెబ్బలు పడితే నీకేమి ఒరుగుతుంది?' అన్నాడు కడు విచారముతో. 'అతను మరలా ఓ స్త్రీని కొట్టాడు' అన్నాడు ఇవాన్.

'నీవు అతనికి చేసిన – చేస్తున్నదేమి అతను చేయలేదే' అన్నాడు తండ్రి. ఈ మాటలకి ఇవాన్‌కి కోపం వచ్చింది. 'నా ఇల్లు తగులబెడతానన్నాడు' అని అరిచాడు.

'ఇవాన్! నువ్వు బలవంతుడివి. ఎక్కడికైనా ఎప్పుడైనా వెళ్ళగలవు. కాని నేను చాలాకాలంగా మంచంలో ఉన్నాను. నీవనుకొంటున్నావు నీకు చాలా తెలుసునని. నాకంటే తెలివిగలవాడినని. నీవు ఇంకా చిన్నవాడివే. కాని నీ తప్పులు నీకు కనిపించవు. పూర్వం ఈ రెండు ఇళ్ళు ఒకటిగా ఉండేవి. సంతోషంగా ఉండేవి. యుద్ధంలో ఉన్న జవానుకి నీకు ఏమీ తేడాలేదు.

యేసుప్రభువు ఏమి చెప్పాడు. నేను చిన్నప్పటి నుండి ఎలాపెంచాను? ఎవరైనా ఓ చెంపమీద కొడితే రెండవ చెంప త్రిప్పమన్నాను ఔనా? కనుక నీ గర్వాన్ని తగ్గించు కోవలసి ఉన్నది' అన్నాడు.

ఇవాన్ మౌనంగా ఉన్నాడు. తండ్రి మాటలు అతని హృదయం లోపల పనిచేస్తున్నాయి.

పెద్దాయన దగ్గి మరలా 'యేసుప్రభువు మనల్ని దుర్మార్గులు అని పిలిచాడు. ఆయన మనకొరకు సిలువలో మరణించలేదా? నువ్వు ఈ లోకము గురించి మాత్రమే ఆలోచిస్తున్నావు. ఇన్ని రోజులు కోర్టు కేసుల కొరకు ఎంత డబ్బు తగలేశావు? నీ పొలంలో పంట ఎందుకు పడిపోయింది? నీ పిల్లలు ఎందుకు సంతోషంగా లేరు? సరైన సమయంలో పొలం దున్ని సరైన సమయంలో నాట్లు వేశావా? ఈ రోజంతా నీవిక్కడే గడపావు. నీ పొరుగువానికి శిక్ష పడేటట్లు చేశావు. ఒకరోజు నీకు అదే సంభవించవచ్చును. నిన్నెవరైనా కష్టపెడితే యేసుక్రీస్తు నామములో వారిని క్షమించు. అప్పుడు నీవు వృద్ధి చెందుతావు. నీ హృదయంలో నుండి ఆనందం ఎక్కడికి పోదు' అన్నాడు ఇవాన్ తండ్రి.

ఇవాన్ మౌనంగా కూర్చున్నాడు. 'పెద్దవాడిని! సలహా తీసుకో. నా గుఱ్ఱం ఎక్కి కోర్టుకు వెళ్ళి నీ పొరుగు వానిమీద నీవు పెట్టిన అభియోగాలన్నిటిని వెనుకకు తీసుకో. రేపు గోర్డే దగ్గరకు వెళ్ళు. యేసుప్రభువు నామమున అతనిని మన ఇంటికి ఆహ్వానించు. రేపు పరిశుద్ధ దినము (పరిశుద్ధ మరియమ్మ పుట్టినరోజు)' అన్నాడు.

ఇవాన్ పెద్దగా నిట్టూర్చాడు. హృదయం తేలిక అయినట్లుగా ఉన్నది. తండ్రి చెప్పినది మంచిదే. కాని దానిని చేతలలో చూపించడం ఎలా సాధ్యము? అనుకొన్నాడు.

'లేచి వెళ్ళు ఇవాన్! రగులుతున్న మంట పెద్దది కాకముందే ఆర్పివేయి. లేకుంటే అది లోకాన్నంతటిని దహిస్తుంది అన్నాడు. ఇంతలో పొలం నుండి స్త్రీలు, పిల్లలు లోనికి వచ్చారు. వచ్చీరాగానే గోర్డేని గురించి మాట్లాడుతూనే ఉన్నారు. అతనికి ఇరవై బెత్తపు దెబ్బలు పడతాయని. ఇంకా ఏవేవో కొన్ని కల్పిత కథలను చెప్పసాగారు. 'గోర్డే కోడలు ఊర్లో అందరికి కథలు చెబుతుంది' అని – 'ఈ ఊరి టీచర్‌గారు ఇవాన్ మీద "జార్" చక్రవర్తికి పిటీషన్ ఒకటి వ్రాశాడని, అందువలన ఇవాన్ ఆస్థిలో సగము గోర్డేకి ఇవ్వబడుతుందని పుకారు ప్రకటించిందని' చెప్పారు.

ఇదంతా మౌనంగా విన్న ఇవాన్ కోపంతో ఊగిపోయాడు. అప్పుడు అతని హృదయంలో మరలా మంట ప్రారంభమైంది. ఇవాన్ ఎప్పుడు తీరుబడిలేకుండా ఉంటాడు. ఇంటిపనులు చేస్తుంటాడు. ఇవాన్ బయటికి వచ్చాడు. సంధ్యా సమయములో పిల్లలు పొలం దున్నే పని ముగించుకొని వచ్చారు. వాళ్ళని కలుసుకొని పొలం విషయం అడిగాడు. చీకటి పడిన తర్వాత తలుపు మూసి లోనికి వెళ్ళాడు. ఇంతలో తండ్రి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. బయటికి వెళ్దామని తలుపు తెరవబోయేటప్పటికి బయట గోర్డే స్వరము 'ఆ సైతానుతో నాకేమి పని? వాడికి మరణం తధ్యము' అని తనను గురించి గోర్డే ఎవరితోనో చెబుతున్నాడు.

ఇవాన్ కొంచెంసేపు లోనే నిలబడి ఆలోచిస్తూ గదిలోకి వెళ్ళాడు. అతను ఇంట్లోకి వచ్చినప్పుడు ఇల్లంతా ప్రశాంతంగా ఉంది. స్త్రీలు భోజనము తయారుచేస్తున్నారు. రెండవవాడు వాయిద్యము వాయిస్తున్నాడు. చక్కని ఆహ్లాదకర వాతావరణము కనిపించింది. పోతే పొరుగువారితో ఉన్న పోరు అనే చీకటి కోణం కనబడుతున్నది. ఇవాన్ బయటకు వచ్చాడు. చీకటిగా, కొంచెం మబ్బుగా ఉన్నది. గోర్డే మాటలు 'త్వరలో ఒక ఆస్తి తగలబడిపోతుంది' అన్న మాటలు అతని మస్తిష్కములో నుండి బయటకు వస్తున్నాయి.

ఏదో తెగించి ఉన్నాడు అనుకొన్నాడు ఇవాన్. నా ఇల్లు తగులబెడితే వాడి ఇల్లు తగులబడి పోతుందిగా అనుకొన్నాడు. మరలా కొంచెంసేపు ఆలోచించి ఒకవేళ నా ఇంటికి నిప్పు పెట్టాలనుకుంటే వెనుక ప్రక్కగా వచ్చి నిప్పు ముట్టించి ఎవరికి కనబడకుండా వెళ్ళిపోవచ్చు అనుకొన్నాడు. ఆ ఆలోచన ఇవాన్ మనస్సులో నెమ్మది లేకుండా చేసింది. ఒకసారి ఇంటి చుట్టూ తిరిగి వస్తాను అనుకొని ఇంటి వెనుక వైపునకు నిశ్శబ్ధంగా నడిచాడు.

పశువుల కొష్టాం వద్దకు వచ్చాడు. తన గుండె కొట్టుకొనే శబ్ధం తనకు వినబడుతుంది. శబ్దం లేకుండా వెనుక ప్రక్కకు వస్తుంటే నాగళ్ళు పెట్టిన చోట ఏదో కదలిన శబ్ధం వినబడింది. ఇవాన్ గుండె కొట్టుకొన్నది. చీకట్లో ఏమి కనబడకపోయినా అలా చూడడం ప్రారంభించాడు. కండ్లు చీకటికి అలవాటు పడిపోయాయి.

ఎవరో ఓ వ్యక్తి చేతిలో గడ్డి పట్టుకొని ఉన్నాడు. అగ్గిపెట్టె గీచి గడ్డికి ముట్టించాడు. అంతా వెలుతురు. ఆ వ్యక్తి వీపు తన వైపు ఉన్నది. ఇవాన్ ఆ వ్యక్తిని గట్టిగా చేతులతో బంధించాడు. అతను గోర్డే. అతను చేతిలోని మండుతున్న గడ్డిని క్రిందపడేసి ఒక్క ఉదుటున ఇవాన్ చేతిలోనుండి తప్పించుకొని పరుగెత్తాడు. ఇవాన్ నేలపై మండుతున్న గడ్డిని

**తరువాయి భాగం 7వ పేజీలో**

సీరియల్

# వాక్యంలోని వనితలు

5

- శ్రీమతి దానం మెర్సీ ఇశ్రాయేలు

**దెబోరా :-** ఇశ్రాయేలీయులను నడిపించిన మోషే, తరువాత యెహోషువ చనిపోయాక ఇశ్రాయేలీయులకు సరియైన నాయకుడు లేకపోయాడు. దేవుడే వారిని నడిపిస్తూ వచ్చాడు. కాని వారు దేవునికి సరిగా లోబడక ఆయనకు విరోధంగా పాపం చేస్తున్నందువల్ల దేవుడు కొన్నిసార్లు వారి శత్రువులకు వారిని అప్పగిస్తూ వున్నాడు. ఆ శత్రువుల కఠిన రాజ్యపాలనలో బాగా నలిగి పశ్చాత్తాపముతో యెహోవాకు మొరపెడుతూ ఉండేవారు.

అలాంటి సమయాల్లో దేవుడు వారి మొరలు విని కనికరించి వారికి ఒక న్యాయాధిపతిని ఏర్పాటుచేస్తూ ఉండేవాడు. అలాంటి సమయంలోనే ఒత్నీయేలు, ఏహూదు అను న్యాయాధిపతుల తరువాత ఒక స్త్రీని న్యాయాధిపతిగా ఏర్పాటు చేయడం ఆశ్చర్యంగా ఉంది. ఆ దినాల్లో స్త్రీలకు ఆధిక్యత తక్కువే! అయినా దేవుడు ఒక స్త్రీని న్యాయాధిపతిగా నియమించాడు. ఆమె పేరు "దెబోరా!" ఆమె భర్త పేరు 'లప్పీదోతు!'

దెబోరా యెహోవా యందు భయభక్తులు కలిగిన స్త్రీ. దేవునితో ఎక్కువ సహవాసము కలిగి వున్నందున ఆమె "ప్రవక్తి"గా ఉంటూ వుంది. ఎఫ్రాయీయుల మన్యంలో "రామా"కును "బేతేలు"కును మధ్య నున్న "దెబోరా వృక్షం" క్రింద కూర్చుని ప్రజలకు న్యాయాధిపతిగా తీర్పు తీరుస్తుండేది. తీర్పుకోసం ఇశ్రాయేలీయులు ఆమె దగ్గరకు వస్తు ఉండేవారు. ఆమె పై వారికి చాలా నమ్మకం. ఎందుకంటే ఆమె దేవుని చిత్త ప్రకారం తీర్పు తీర్చగలిగిన ప్రవక్తి!

దెబోరా న్యాయాధిపతిగా నియమించ బడేటప్పటికి ఇశ్రాయేలీయులు అప్పటికి ఇరవై ఏండ్ల నుండి కనానీయుల పాలనలో కఠినమైన శ్రమలు అనుభవిస్తున్నారు. వారి రాజు "యాబీను" అతని సేనాధిపతి "సీసెరా" వారిని బహుగా కష్టపెట్టారు. వారికి చాలా గొప్ప సైన్యం వుంది, తొమ్మిది వందల ఇనుప రధాలున్నాయి. ఈ బాధలన్నీ వారు భరించలేక తాము దేవునికి విరోధంగా చేసిన పాపానికి పశ్చాత్తాపంతో దేవునికి మొరపెట్టారు. (న్యాయా 4:3)

అప్పుడు దేవునితో ఎప్పుడూ సహవాసం కలిగిన ప్రవక్తి దెబోరాతో దేవుడు మాట్లాడాడు. అప్పుడు దెబోరా, అబీనోయము కుమారుడైన బారాకును పిలవనంపింది. దేవుడు ఆమెతో చెప్పిన విషయం అతనితో చెప్పింది. నఫ్తాలీయులలోను, జబూలీయులలోను పదివేలమంది మనుష్యులను తాబోరు కొండ దగ్గరకు తీసుకొని రమ్మంది. అక్కడికి దేవుడు యాబీను రాజు సేనాధిపతి సీసెరాను అక్కడికి తీసుకొని వచ్చి అతని చేతికి అప్పగించబోతున్నాడని చెప్పింది. బారాకు వెళ్తానన్నాడు గాని "నీవు నాతో కూడా వస్తేనే వెళ్తానన్నాడు". లేకపోతే వెళ్ళనని కూడా చెప్పాడు. దెబోరా స్త్రీ అయినా గొప్ప సైన్యము, రధాలు కలిగిన శూరులతో యుద్ధానికి భయపడక వస్తానన్నది గాని "అయితే నీకు ఘనత కలుగదు. యెహోవా ఒక స్త్రీ చేతికి సీసెరాను అప్పగిస్తాడ"ని చెప్పింది. ధైర్యంగా అతనితో కూడా వెళ్ళింది.

బారాకు, దెబోరా 'తాబోరు' కొండమీదికి వచ్చారని తెలియగానే సీసెరా తన గొప్ప సైన్యాన్ని, తొమ్మిది వందల ఇనుప రధాలను తీసుకొని వారి మీదకి యుద్ధానికి వచ్చాడు. దెబోరా వాళ్ళని చూచి ఎంతో ధైర్యంగా "లెమ్ము, యెహోవా నీ చేతికి ఈ రోజే సీసెరాను అప్పగిస్తున్నాడు. యెహోవా నీకు ముందుగా బయలుదేరును కదా" అని బారాకుకు ధైర్యం చెప్పి, ప్రోత్సాహించి ముందుకు పంపింది. బారాకు వాళ్ళని హతము చేయడానికి యెహోవా సీసెరాను, అతని సేనను, రధాన్ని కలవరపరచగా సీసెరా, భయముతో, కంగారుగా తన రధము దిగి కాలినడకనే పారిపోయాడు. (న్యాయా 4:15) సీసెరా పారిపోగానే బారాకు వారి రధాన్ని, సర్వసేనను కత్తితో కూల్చి వేశాడు. ఒక్కడైనను మిగలలేదు (16వ).

సీసెరా మాత్రం పారిపోతూవుంటే హెబెరు భార్య అయిన "యాయేలు" అతనిని ఎదుర్కొని భయపడకుండ తన గుడారంలోకి రమ్మని అతని పిలిచి ఎవరికి కనబడ కుండా గొంగళితో అతని కప్పింది. అతడు దాహానికి కొంచెం నీళ్ళిమ్మని అడిగినపుడు ఆమె అతనికి పాలు అందించింది. ఎవరైనా లోపలికి వచ్చి ఇక్కడెవరైనా ఉన్నారా అని అడిగితే లేరని చెప్పమని చెప్పి గాఢ నిద్రపోయాడు సీసెరా. అతడు

బాగా నిద్రపోయిన తరువాత యాయేలు ఒక గుడారపు మేకు తీసుకొని, సుత్తెతో తలమీద కొట్టగా అది అతని కణతలలో దిగి అక్కడనే సీసెరా చనిపోయాడు.

బారాకు సీసెరా కొరకు వెదకుతు వస్తూ ఉన్నప్పుడు యాయేలు అతని ఎదుర్కొని నీవు వెదుకుచున్న మనుష్యుని నేను చూపిస్తాను రమ్మని అతని పిలిచి తన గుడారములోకి తీసుకొనిపోయింది. అక్కడ సీసెరా చచ్చి పడివున్నాడు. ఆ తరువాత కానాను రాజైన యాబీనును కూడా ఇశ్రాయేలీయులు చంపారు. అప్పుడు దెబోరా, అబీనోయాము కుమారుడైన బారాకు కలిసి, సంతోషంగా కనానీయులను చంపడంలో ఏవిధంగా యెహోవా వారికి సహాయం చేశాడో, ఏవిధంగా వారు యుద్ధము చేసారో అంతా చక్కగా గానం చేశారు.

దెబోరా, స్త్రీ అయినా ఇంత గొప్ప యుద్ధానికి ఆమె వెరువక ముందుకు సాగిపోయిందంటే అది కేవలము దేవుని బలమే! దేవునితో ఆమెకున్న సహవాసము – ఆమె దేవుని స్వరాన్ని, ఆయన మాటలను వినడానికి తోడ్పడింది. అంతేకాక ఆయన చిత్తాన్ని తెలుసుకొని నడుచుకోవడానికి ఆస్కారమయింది. దేవుని ప్రేమించి ఆయన మాటకు లోబడియుండడం నేర్చుకొంది. అందుకే ఆమె పాడిన పాటలో దేవుని ప్రేమించువారు బలముతో ఉదయించు సూర్యునివలె ఉందురు(6:31) అని పాడగలిగింది. ఆయన యందు విశ్వాసంతో ముందుకు సాగింది.

యెహోవా సీసెరాను అప్పగించిన దినము ఇదే. యెహోవా నీకు ముందుగా బయలుదేరును గదా(4:41) అని విశ్వాసంతో, ధైర్యంతో చెప్ప గలిగింది. దేవుని యందు ఆమెకున్న భయభక్తులు, విశ్వాసము, విధేయత ఆమె దేవుని చిత్త ప్రకారం నడవడానికి తోడ్పడ్డాయి. ఆమె ఆ విధంగా నడిచినందువల్ల మంచి ప్రవక్తిగా, న్యాయాధిపతిగా, యుద్ధ సమయాల్లో జ్ఞానయుక్తంగా ధైర్యంగా ముందుకు పోగలిగే ధైర్యశాలిగా దేవునికి మహిమ తేగలిగింది.

స్త్రీలు అయినా దెబోరాలాంటి గుణాలు కలిగి వుంటే – బలముతో ఉదయించు సూర్యునివలె వుండి గొప్ప కార్యాలు చేయగలము. ఆవిధంగా ఉండడానికి ప్రయత్నించు దము గాక!

**19 వ పేజి తరువాయి భాగం**

రూపాయలు చిల్లర దొరికింది. వెంటనే స్టేషన్‌కు వెళ్ళి జాండ్రపేట టిక్కెట్టు తీసుకుని చీరాల విజయ హాస్పిటల్‌కి ఆటోలో వెళ్ళి హైదరాబాదు నుండి వచ్చిన, శ్రీ కట్టా రాజ్ వినయ్‌కుమార్ గారితో, వారి సహోదరి శ్రీమతి నాగేశ్వరి గారితో మాట్లాడుతుంటే ఫోన్ మ్రోగింది. హైదరాబాద్ నెంబరు! లేచి ప్రక్క గదిలోకి వెళ్ళాడు. 'సామ్యేల్ గారేనా!?' అని అడిగారు. 'ఔనండి!' అని చెప్పాడు. 'అకౌంట్‌లో డబ్బులు వేశాను' అన్నారు. ఈ రోజు శనివారం కదా, ఇంతలో ఎలా వేశారు? అనుకుంటూ, 'అమ్మా! మీ పేరు?' అని అడిగాడు. మాట్లాడలేదు. 'అమ్మా! ఎంత వేశారు?' అని అడిగాడు. 'పదివేలు' అన్నారు. తను ఆశ్చర్యంతో ఒక్క క్షణం ఆగి 'ఎంత వేశారమ్మా!' అని మళ్ళీ అడిగాడు. 'టెన్ తౌజండ్' అని చెప్పారు. 'అమ్మా! దయచేసి మీ పేరు చెప్పండి!' అని అడిగాడు. పేరు చెప్పకుండా ఫోన్ పెట్టేశారు.

వెంటనే తన కుమారుడు, "హన్నాకృప" ఎడిటర్ నతనియేల్‌కి ఫోన్ చేసి ఎ.టి.యమ్.కి వెళ్ళి తన అకౌంటులో ఎంత ఉన్నాదో చూడమని చెప్పాడు. 'బ్యాలెన్సు లేదుగా!' అన్నాడు. ఎ.టి.యమ్. కార్డు నతనియేలు ఆపరేట్ చేస్తుంటాడు. 'నీకెందుకు? చెప్పిన పని చేయి' అన్నాడు కొంచెం కోపంగా! పది నిమిషాల తర్వాత ఫోన్ చేసాడు. 'పదకొండు వేలు ఉన్నాయి' అన్నాడు. ఫోన్‌లోనే ఆశ్చర్యపోయాడు.

ఒంగోలు వచ్చిన తర్వాత ఆ డబ్బులు డ్రా చేశాడు. "హన్నాకృప" పదకొండవ వార్షికోత్సవ పనులు ప్రారంభించారు. ఆ డబ్బులు పంపించిన సహోదరి మాట్లాడిన ఫోన్ నెంబరుకి నాలుగైదు రోజులు ప్రయత్నించాడు సామ్యేలు. ఎవరు రిసీవ్ చేయలేదు. చివరికి ఒకసారి లిఫ్ట్ చేసారు, కాని రాంగ్ నెంబర్ అని పెట్టేశారు.

ఆగష్టు 17వ తేది, "హన్నాకృప" పదకొండవ వార్షికోత్సవ వేడుకకు, పుస్తకావిష్కరణకు అవసరమైన ఆర్థిక సహాయంలో అధిక భాగం భరించిన హైద్రాబాద్ సహోదరికి దేవుని ద్వారా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

# సువార్తలలోని యేసు కథ

యూదుల "హిల్లాలు" ఒక మనిషి రోజుకు మూడు సార్లు ప్రార్థించవలెనని చెబుతున్నది. అయితే యేసుప్రభువు మనం ప్రతి విషయానికి అవసరతలకు ఎల్లప్పుడు ప్రార్థించ వలెనని చెప్పాడు. విసుకక నిత్యం ప్రార్థించమని చెప్పాడు. అందుకై ఎన్నో ఉపమానాలు చెప్పాడు. ప్రార్థించేటప్పుడు అవి మనం పొందియున్నామని నమ్మి ప్రార్థించమన్నాడు. మన యొక్క ఓర్పుకు కూడా ఆయన బహుమానం ఇస్తాడు.

మన ప్రార్థనకు జవాబు ఆలస్యం అయి ఉండ వచ్చును. ఆలస్యం కూడా మన విశ్వాసాన్ని పెంచుతున్నది. నిరాశచెంది ప్రార్థించుట నిలిపివేయకూడదు. ఈ ప్రార్థన విధానమునే లూకాపత్రికలో ప్రభువు వివరించాడు. మన ప్రార్థన ఈ క్రింది ఇద్దరు వ్యక్తుల ప్రార్థనతో పోల్చుకొని చూడవలసియున్నది. మనకు తెలియకుండానే మనం ఒక్కోసారి పరిసయ్యుల వలె ప్రార్థిస్తామేమో! అందువలన మన ప్రార్థనకు సరైన జవాబు రాలేదేమో! అందుకు ఈ ఉపమానము చెప్పారు.

మోరియా కొండమీద యెరూషలేము దేవాలయం కట్టబడియున్నది. ఎప్పుడో వెయ్యి సంవత్సరాల క్రితం ఈ కొండపై తన కుమారుడైన ఇస్సాకును బలి ఇవ్వడానికి అబ్రాహాము ఇక్కడికి వచ్చాడు. ఇప్పుడు కొన్నివేలమంది ఇక్కడి మందిరములో ప్రార్థించడానికి వస్తూవున్నారు. దేవాలయంలో ప్రార్థన చేస్తేనే దేవుడు వింటాడని కాదుగాని ప్రార్థనకు మనం ఏర్పాటు చేసుకొనిన స్థలములో మనకు మంచి ప్రార్థన వస్తుంది.

పరిసయ్యులకు – వారు తాము దేవునికి చేరువైన వారము అని వారి భావన. అందువలన ఇతరులను చిన్న చూపు చూస్తారు. దేవాలయము వెళ్ళేది దేవునితో మొరపెట్టు కోవడానికి! ఇంటి వద్ద దొరకని నెమ్మది, సమాధానము దేవాలయములో మానవ హృదయము పొందుతున్నది అన్న భావన.

ఇక్కడ ఇద్దరు వ్యక్తులు కాక రెండు మనస్తత్వాలు ఆయన చూపిస్తున్నాడు. ప్రార్థన చెయ్యడానికి ముందు దేవుని ఎడల మన భావము ఏమైవున్నదో, దానిని బట్టి మన ప్రార్థన వస్తుంది.

పరిసయ్యుడు తాను ప్రార్థిస్తున్నట్లుగా పదిమంది చూడాలని కోరుకుంటున్నాడు. పరిసయ్యుడు – తను దేవుని దృష్టిలో ఏ విధముగా ఉన్నాడో చూచుకోకుండా మానవ దృష్టితో – ప్రభూ! నేను ఇతరుల్లా అంటే మోసగాళ్ళలా, దుర్మార్గుల్లా, వ్యభిచారుల్లా ఉండనందుకు నీకు కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

నేను వారానికి రెండుసార్లు ఉపవాసాలు చేస్తాను. నా సంపాదనలో పదవభాగము దేవునికి చెల్లిస్తాను అని తనను గూర్చి తను గొప్పగా చెప్పుకున్నాడు. ఆ గొప్పతనాన్ని కొలవడానికి మానవులను పెట్టుకున్నాడు. వాళ్ళకంటే వీళ్ళకంటే భక్తిగల వాడినని చెప్పుకున్నాడు. అతను దేవున్ని ఏమి అడుగలేదు.

అయితే సుంకరి దేవాలయములోనికి వెళ్ళడానికి అర్హుడని అనుకోలేదు. గాని, ఓ మూలలో నిలుచుని ఆకాశమువైపు కన్నులెత్తే ధైర్యము లేక గుండెలు బాదుకుంటూ – దేవా! నేనొక పాపిని. నా పై దయ చూపు అని అన్నాడు. పరిసయ్యునికంటే సుంకరిని దేవుడు నీతి మంతునిగా తీర్పు తీర్చాడు. ఎందుకంటే గొప్పలు చెప్పుకొనే వాడు అణచబడుతాడు. అణకువతో ఉన్నవాడు గొప్ప స్థానానికి ఎత్తబడతాడు అని యేసుప్రభువు చెప్పాడు.

యేసుప్రభువు ఇప్పుడు గలిలయ నుండి యెరూషలేము వైపుగా ప్రయాణం చేస్తున్నాడు. పస్కా పండుగకి వెళ్ళే వందలాది యాత్రికులు ఆ దారినే ప్రయాణం చేస్తున్నారు.

యూదుల సర్వ సభ్య సభ సన్‌హెడ్రిన్ సభ. దీని సభ్యులు ఏవిధముగానైనా యేసును ఇబ్బందిలో పెట్టాలని

అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

చాలాకాలం క్రితం యోహాను – హేరోదు అంతిపా తన తమ్ముని భార్యమీద కోరికతో తన భార్యకు విడాకులిచ్చి హేరోదియను పెండ్లి చేసుకొన్నాడు. యూదా మతములోని రబ్బీలు రెండు తరగతులుగా విడిపోయారు. పరిసయ్యులు, సద్దూకయ్యులు.

పరిసయ్యులు మోషే ధర్మాశాస్త్రాన్ని నిక్కచ్చిగా పాటించేలా ఉన్నారు. కానీ, సద్దూకయ్యులు పునరుత్థానము లేదని, చనిపోయిన తర్వాత తీర్పులాంటివి ఉండవని వాదిస్తుంటారు. సద్దూకయ్యులు స్త్రీలను హీనంగా చూస్తారు. ఎవరైనా తన భార్యను విడనాడి మరలా పెండ్లి చేసుకో వచ్చును. అయితే ఆమెకు (పరిత్యాగపత్రిక) విడాకులు ఇవ్వవలసివున్నది. హిల్లాలు అనే గ్రూపువారు దీనికి అనుకూలముగా ఉంటారు. వీరికి యూదా 'షమ్మాయి' వ్యతిరేకము.

ఇప్పుడు యేసు వ్యతిరేకులు ఆయన వద్దకు వచ్చి – బోధకుడా! ఒక పురుషుడు తన భార్యకు ఏదో ఒక కారణం చూపి విడాకులివ్వవచ్చునా? అని అడిగారు. ఒక వేళ యేసు అలా విడాకులివ్వడానికి వీలు లేదంటే – అది తప్పు అని చెబితే నాటి హేరోదుకు ఈ సంగతి తెలిస్తే తనకు వ్యతిరేకముగా యేసు మాట్లాడాడని అనుకోవచ్చును. ఆ రోజుల్లో భార్య – కూర సరిగ్గా వండకపోయినా ఓ కాగితము వ్రాసి ఆమెకు ఇచ్చి ఆమెను వదిలివేయవచ్చును.

యేసు 'సృష్టికర్త – పురుషుని, స్త్రీని సృష్టించి ఇలా అన్నాడు. పురుషుడు తన తల్లిదండ్రులను విడచి తన భార్యతో ఏకమవుతాడు. వాళ్ళిద్దరు కలిసి ఒకే శరీరంగా జీవిస్తారు. ఇది మీరు చదువలేదా? ఆ కారణంగా వారిని ఇకమీదట ఇరువురిగా కాక ఒకరిగా పరిగణించాలి. దేవుడు ఏకం చేసిన వాళ్ళని మానవుడు వేరుపరచరాదు' అన్నాడు.

మరి పురుషుడు విడాకుల పత్రం ఇచ్చి ఆమెను పంపివేయవచ్చని మోషే ఎందుకు చెప్పాడు? అన్నారు.

యేసు మీరు దేవుని ఆజ్ఞలను అనుసరించేవారు కాదు. కాబట్టి మీ భార్యలకు విడాకులివ్వడానికి మోషే మీకు అనుమతి ఇచ్చాడు. అంతే కాని మొదటి నుండి ఈ విధంగా లేదు. నేను చెప్పేదేమంటే అవినీతిపరురాలు కాని తన భార్యకు విడాకులిచ్చి మరొక స్త్రీని వివాహమాడిన వాడు వ్యభిచారిగా పరిగణించబడతాడు. విడువబడ్డ దానిని పెండ్లి చేసుకొనినవాడు వ్యభిచారి అవుతాడు అన్నాడు.

శిష్యులు – భార్యాభర్తలకుండు సంబంధము ఇట్టిదైతే పెండ్లి చేసుకొనుట యుక్తము కాదని ఆయనతో అన్నారు.

యేసు – మీరన్నట్లు చెయ్యడం అందరికి సాధ్యం కాదు. కొందరు నపుంసకులుగా పుట్టారు. కనుక వివాహం చేసుకోరు. మరికొందర్ని ఇతరులు నపుంసకులుగా చేస్తారు. కనుక వారు వివాహం చేసుకోరు. పరలోక రాజ్యము నిమిత్తము తమ్మును తామే నపుంసకులుగా చేసుకొనిన నపుంసకులు కలరు. ఈ బోధను అనుసరించగలవాడే అనుసరించని అని సమాధానం చెప్పాడు.

యేసు తన చేతుల్ని చిన్నపిల్లల తలలపై, ఉంచి వాళ్ళకోసం ప్రార్థించాలని కొందరు వ్యక్తులు వాళ్ళను ఆయన దగ్గరకు పిలుచుకొని వచ్చారు. కాని ఆ పిలుచుకు వచ్చిన వాళ్ళను శిష్యులు చివాట్లు పెట్టారు. కాని యేసు "దేవుని రాజ్యం అలాంటి వాళ్ళదే కనుక వాళ్ళను నా దగ్గరకు రానివ్వండి! వాళ్ళనాపకండి!" అని అన్నాడు. వాళ్ళ తలలపై చేతులుంచాక యేసు అక్కడనుండి ముందుకు సాగిపోయాడు. ఈ చిన్నపిల్లల్లో ఎవర్ని చిన్న చూపు చూడకండి. నేను చెప్పేదేమిటంటే పరలోకంలో ఉన్న వీళ్ళ దూతలు పరలోకం లో ఉన్న నా తండ్రి ముఖాన్ని ఎప్పుడూ చూస్తూ ఉంటారు.

ఒకని దగ్గర వంద గొఱ్ఱెలు ఉన్నాయనుకోండి. అందులో ఒక గొఱ్ఱె తప్పిపోతే, అతడు ఆ తొంభై తొమ్మిది గొఱ్ఱెల్ని కొండమీద వదిలి, ఆ తప్పిపోయిన గొఱ్ఱె కోసం వెతుక్కొంటూ వెళ్ళడా? మీరేమంటారు? ఇది సత్యం, ఒక వేళ ఆ గొఱ్ఱె దొరికితే ఆ తప్పిపోని తొంభై తొమ్మిది గొఱ్ఱెలు తన దగ్గరున్న దానికన్నా ఎక్కువ ఆనందిస్తాడు. అతనిలాగే పరలోకంలో వున్న నా తండ్రి ఈ చిన్న పిల్లల్లో ఎవ్వరూ తప్పిపోరాదని ఆశిస్తుంటాడు అని యేసుప్రభువు అన్నారు.

North East West South వార్తలు

# క్రైస్తవులపై ఆరెస్సెస్ దాడి

**ఆంధ్రప్రదేశ్, రామగుండం :** అక్టోబర్ 15, శనివారం రామగుండంలో సురేష్ రాజశేఖర్ అనే పాస్టర్ పై ఆరెస్సెస్ గూండాలు దాడిచేశారు.

వివరాలు పరిశీలిస్తే 1998వ సంవత్సరం నుండి రామగుండం ప్రాంతంలో క్రీస్తు సువార్త పరిచర్యలు చేస్తున్న పాస్టర్ సురేష్ రాజశేఖర్ అతని సంఘసభ్యులు అక్టోబర్ 18 నుండి 20 వరకు నిర్వహించి తలపెట్టిన కల్వరి టెంపుల్ మీటింగ్స్ నిర్వహణలో ఉండగా వీటిని పాడుచేయాలనుకున్న క్రైస్తవ వ్యతిరేక మతోన్మాద శక్తులు అక్టోబర్ 15న జ్యోతినగర్ పోలీస్ స్టేషన్ సమీపంలోని నేషనల్ థర్మల్ పవర్ స్టేషన్ సమీపంలో క్రైస్తవ యౌవనస్తులపై ఆరెస్సెస్ కార్యకర్తలు దాడిచేశారు. హైందవులను బలవంతంగా మతమార్పిడి చేస్తున్నారంటూ దాడిచేసి కేసుపెట్టారు. గతంలోను అలాగే దాడిచేశారు.

యౌవనస్తులపై దాడి విషయం విన్న పాస్టర్ సురేష్, సహోదరుడు సోలోమోన్ మరికొందరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళుతుండగా సుమారు 100 మంది ఆరెస్సెస్ గూండాలు కర్రలు, రాళ్ళతో పాస్టర్ బృందంపై దాడిచేశారు. ఈ దాడిలో వాహనం ధ్వంసం అయింది. చాలామందికి తలలు పగిలాయి. ఈ దాడి – వారి నాయకుడు తోట కుమార్‌స్వామి ఆధ్వర్యంలో జరిగినట్లు తెలిసింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న పోలీస్ వాహనం చూసి దుండగులు పరారయ్యారు. అయితే ముందుగా దాడికి గురయిన యవ్వనులపై కేసు నమోదు చేసి కరీంనగర్‌కు తరలించినట్లు తెలిసింది.

# స్వామి లక్ష్మణానంద హత్య మావోల పనే

**భువనేశ్వర్ :** ఒరిస్సాలో క్రైస్తవుల ఊచకోతకు మూలకారణం అయిన లక్ష్మణానంద హత్యకేసులో పోలీసులు ఆఖరి చార్జిషీటు సమర్పించారు. మూడు సంవత్సరాల క్రితం స్వామి, అతని అనుచరులు నలుగురిని నలభై మంది గల ఓ బృందం కాల్చి చంపింది. ఆ పని క్రైస్తవులు చేశారంటూ క్రైస్తవులపై హైందవులు దాడులు చేసి అనేకమందిని హత్య చేసిన సంగతి విదితమే. అయితే ఈ హత్య మావోల పనే అని పోలీసులు ఏడుగురు మావోలపై చార్జిషీటు దాఖలు చేసారు.

జనవరి 30, 2009న మొదటి చార్జిషీటులో ఏడుగురు దళిత క్రైస్తవులపై పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. అయితే సుదీర్ఘ విచారణ అనంతరం ఇది మావోల పనే అని తేల్చారు.

సీనియర్ మావోయిస్టు లీడర్ సభ్యసాచి పాండ, పులారి రామారావు, జాదు అలియాస్ సోమనాథ్ దండసేన, ఆజాద్ అలియాస్ దోన కేశవరావు, దస్రు అలియాస్ దాసన్న, లాలు మరియు లక్కు అలియాస్ మదన్‌లుగా గుర్తించారు. వీరిలో ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ చేశారు.

2008 ఆగస్ట్‌లో 82 సంవత్సరాల లక్ష్మణానంద సరస్వతిని వీరు కాల్చి చంపారు. ఆ తదనంతరం జరిగిన మతకలహాల్లో సుమారు 43 మంది క్రైస్తవులు చనిపోగా కొన్ని వేల ఇళ్ళు, చర్చీలు విధ్వంసకాండలో కూల్చబడ్డాయి.

ఇప్పటికి ఆ ఘటనల ఫలితాలు మామూలు స్థితికి చేరుకోలేదు.